Postal License No.VJ/220/2023-25



# నేటి పత్రిక ప్రజా వార్త


NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

TELUGU ONLINE
DIGITAL NEWS
PORTAL &
ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 24-30 జూన్ 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 05 | సంచిక : 02 | పేజీలు : 4 | రూ. 5.00

## మహిళలకు ఉచిత బస్సు... ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15 నుంచే అమలు: సీఎం చంద్రబాబు




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు 'సూపర్ సిక్స్' లో మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి కల్పించే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చించారు. పథకం అమలుతో పెరిగే ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఇందుకు కొత్త బస్సులు కొనడం గానీ, అవసరమైతే అద్దెకు తీసుకోవడం గానీ చేయాలని సీఎం సూచించారు. ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ విద్యుత్ ఆధారిత ఏసీ బస్సులే ఉండాలని, ఇప్పుడున్న బస్సులను కూడా ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. అలాగే, ప్రతీ బస్సుకు జీపీఎస్ తప్పనిసరిగా అమర్చాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

**ఆర్థిక కష్టాలున్నా హామీలు నిలబెట్టుకోవాలి..** రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా... ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని... అదే సమయంలో ప్రజాధనం సద్వినియోగం కావాలని, ప్రతీ రూపాయి విలువైనదేనని ముఖ్యమంత్రి అధికారులతో అన్నారు. ఆర్థిక కష్టాలను అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకోవాలని సూచించారు. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి... ఇతర మార్గాల ద్వారా ఆదాయాలను ఎలా పొందాలి అనే దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా సమర్థత పెంచుకోవాలని చెప్పారు. బస్ కాంప్లెక్స్‌లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచడం దగ్గర నుంచి బస్సు ప్రయాణం వరకు ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**వివిధ మోడళ్ల పరిశీలనకు సీఎం ఆదేశం...** "బ్యాటరీ స్వాపింగ్ విధానంతో ఆర్టీసీ బస్సుల నిర్వహణ వ్యయం తగ్గే అంశాన్ని పరిశీలించాలి. డీజిల్, ఈవీ, సీఎన్జీ, బ్యాటరీ స్వైపింగ్... ఇలా ఏ బస్సు కొనుగోలు, నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు రూపొందించండి. బ్యాటరీ, బ్యాటరీ లేకుండా, సర్వీస్ స్టేషన్లను ప్రైవేట్ సంస్థలు నిర్వహించడం, బస్సులను ఆపరేట్ చేయడం... ఇలా ఏ విధానంతో వ్యయం తగ్గుతుందనేది పరిశీలించండి. ఆర్టీసీనే పవర్ జనరేట్ చేసి.... ఈవీ బస్సులు వినియోగించగలిగితే ఎంతమేర మెయింటెనెన్స్ కాస్ట్ తగ్గుతుందనేది అంచనా వేయండి. పూర్తి స్థాయిలో కసరత్తు జరగాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**అదనంగా 2,536 బస్సులు అవసరం...** కొత్త పథకం అమలుకు అదనంగా మరో 2,536 బస్సులు అవసరమని అధికారులు లెక్కలు తేల్చారు. దీనికి రూ. 996 కోట్లు వ్యయం కానుందని భావిస్తున్నారు. అలాగే బస్ స్టేషన్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ, బస్సుల సమాచార బోర్డులు, ఇతర సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉందని సీఎంకు అధికారులు వివరించారు.

**ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణిస్తారని అంచనా..** రాష్ట్రంలో మొత్తం జనాభా 5.25 కోట్లు ఉంటే అందులో మహిళలు 2.62 కోట్లు ఉన్నారు. వీరిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సుల్లో మహిళల ప్రయాణాల సంఖ్య ప్రస్తుతం ఏడాదికి 43.06 కోట్లుగా ఉంది. అయితే ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిన తర్వాత ఇది 75.51 కోట్లకు పెరగొచ్చని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి మహిళ సగటున వారానికి ఒకసారి అయినా ప్రయాణిస్తుంటారని తెలిపారు. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం మహిళల ప్రయాణాల సంఖ్య 6.85 కోట్లుగా ఉంది. పథకం అమలు తర్వాత ఈ సంఖ్య 13.39 కోట్లకు పెరగొచ్చు. మొత్తమ్మీద ఉచిత బస్సు పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణించే వీలుంది.

**అన్ని రాష్ట్రాలకన్నా ఉత్తమంగా రాష్ట్రంలో అమలు**... ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. అయితే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టే విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా... ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

**57 శాతం పల్లె వెలుగు, సిటీ బస్సు సర్వీసులే**... మొత్తం బస్సుల్లో 57 శాతం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సులు ఉన్నాయి. గత ఏడాదిలో ఇవి 67.76 కోట్ల కిలో మీటర్ల దూరం ప్రయాణించాయి. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు మరో 17 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం రాష్ట్రానికి బస్సులు కేటాయించింది. రాష్ట్రంలో 11 మున్సిపల్ కార్పొరేషన్లకు 750 ఈవీ బస్సులను కేంద్ర ప్రభుత్వం అర్బన్ ట్రాన్స్‌పోర్టు కింద అందిస్తోంది.

## అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తాం: మంత్రి లోకేశ్



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : సీఎం చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ అని, ప్రజారాజధాని అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్ లో నిర్వహించిన అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాప్ లో సీఎం చంద్రబాబుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ వర్క్ షాప్‌కు హాజరైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, విద్యారంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఇతర అధికారులకు స్వాగతం. అమరావతి వర్క్ షాప్-2025కు మిమ్మల్ని స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. ఇవాళ ఈ సమావేశం దేశంలో అత్యుత్తమ క్యాంటమ్ మేధావుల సమావేశం మాత్రమే కాదు. దేశంలో ఓ కీలక మలుపు కానుంది. భవిష్యత్ లో రాబోయే సాంకేతిక విప్లవానికి సీఎం చంద్రబాబు నేతృత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నారనే సంకేతాన్ని ఇస్తోంది.

**అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తాం...** అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మార్చాలనేది మా లక్ష్యం. ఇక్కడ ఆలోచనలు ఆవిష్కరణలుగా, ఆవిష్కరణలు పరిశ్రమలుగా మారేలా ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఇది ఒకరోజు కార్యక్రమం కాదు. ఇది దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఉద్యమం. ఇందుకు ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా నిలవబోతోంది. క్యూబిట్ ఆర్కిటెక్చర్ నుంచి క్రయో ఎలక్ట్రానిక్స్ వరకు, ఆల్గోరిథం అభివృద్ధి నుంచి అంతర్జాతీయ క్వాంటమ్ ప్రమాణాల వరకు మేం పూర్తిస్థాయిలో క్వాంటమ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తాం. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన 156 క్యూబిట్లను కలిగిన ఐబీఎం క్యాంటమ్ సిస్టమ్-2 త్వరలోనే అమరావతిలో అందుబాటులోకి రానుంది. ఇది చాలా గర్వించదగ్గ విషయం.

ఆసియాలో మొట్టమొదటి క్వాంటమ్ ప్రమాణాల టెస్ట్‌బెడ్‌ను ఎన్పీఎల్, ఐఈఈఈ, సీయాక్, ఏడబ్ల్యూఎస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఐబీఎం, టీసీఎస్, హెచ్ సీఎల్, టెక్ మహీంద్ర వంటి అగ్రగామి సంస్థల సహకారంతో క్యాంటమ్ స్టారప్ ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. ఈ కార్యాచరణకు వ్యూహాత్మక దూరదృష్టి ఉంది. ఇది ప్రధాని మోదీ ప్రకటించిన జాతీయ క్వాంటమ్ మిషన్ కు అనుసంధానంగా, గ్లోబల్ భాగస్వామ్యాలతో నిర్మించడం జరుగుతుంది. ఐఐటీలు, ఐఐఎస్, టోక్యో యూనివర్సిటీల సహకారం తీసుకోవడం జరుగుతుంది.

**చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ...** సీఎం చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ. చంద్రబాబు మొదటి చాప్టర్ ఐటీ అన్నప్పుడు నేను ఏడో తరగతి చదువుతున్నాను. దక్షిణాసియా క్వాంటమ్ కేంద్రంగా అమరావతి అభివృద్ధి చెందుతుంది. సాఫ్ట్ వేర్ రంగానికి సిలికాన్ వ్యాలీగా అమరావతి క్యాంటమ్ వ్యాలీ అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు విజన్ సాధనకు అనుగుణంగా పనిచేస్తూ ప్రపంచపటంలో అమరావతి క్యాంటమ్ కు చోటు దక్కేలా కృషిచేద్దాం.

**ఏపీ బ్రెయిన్ క్యాపిటల్ గా మారుతుంది...** సీఎం చంద్రబాబు లాంటి నాయకుడు ఉండటం మన అదృష్టం. విజన్ అంటే ఇప్పుడు వెలాసిటీ, ఇన్నోవేషన్. గ్లోబల్ రేస్ లో చేరడం కాదు.. మనమే దారి చూపాలి. ఫలితంగా ఏపీ బ్రెయిన్ క్యాపిటల్ గా మారుతుంది. క్వాంటమ్ సైన్స్ ను ఇంజనీరింగ్ లోనూ భాగం చేస్తున్నాం. అమరావతిని క్యాంటమ్ టెక్నాలజీలకు కేంద్రంగా మారుస్తాం. ఇన్నోవేటివ్, స్టార్టప్ లకు ఈ క్యాంటమ్ వ్యాలీ పార్క్ ఓ లాంచ్ ప్యాడ్ అవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సందీప్ పటేల్, ఐబీఎం క్వాంటమ్ అడాప్షన్ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రోడర్, టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్ వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న, ఎల్ అండ్ టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, అడ్వైజర్ ఎంవీ సతీశ్, ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కే మధుమూర్తి, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోఠి, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భారత గూఢచార సంస్థ 'రా' కొత్త చీఫ్ గా పరాగ్ జైన్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) నూతన అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత చీఫ్ రవి సిన్హా పదవీకాలం జూన్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. జూలై 1 నుంచి పరాగ్ జైన్ రెండేళ్ల పాటు ఈ కీలక బాధ్యతలను నిర్వర్తిస్తారు. 1989 బ్యాచ్‌కు చెందిన పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన పరాగ్ జైన్, గతంలో పంజాబ్ డీజీపీగా కూడా సేవలు అందించారు. 2021 జనవరి 1న ఆయన డీజీపీ హోదా పొందారు. ఆయన నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ జూన్ 2న ఆమోదముద్ర వేసింది. గూఢచార వర్గాల్లో పరాగ్ జైన్‌కు 'సూపర్ స్లూత్' అనే పేరుంది. మానవ మేధస్సు (హ్యూమింట్), సాంకేతిక మేధస్సును (టెక్ఇంట్) సమర్థవంతంగా మిళితం చేసి క్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతం చేయడంలో ఆయన దిట్ట అని అధికారులు చెబుతుంటారు. ఈ నైపుణ్యమే అత్యున్నత స్థాయి ఆపరేషన్లకు కీలకంగా నిలుస్తుందని వారు వివరిస్తున్నారు. ఇటీవల పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో పరాగ్ జైన్ కీలక పాత్ర పోషించారు. ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు చేసేందుకు ఆయన బృందం అందించిన ఇంటెలిజెన్స్ సమాచారం భారత బలగాలకు ఎంతగానో ఉపయోగపడింది. వీటితో పాటు, జమ్మూ కాశ్మీర్‌లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం కూడా పరాగ్ జైన్‌ను ఈ పదవికి ఎంపిక చేయడంలో దోహదపడింది.

## ఆన్ లైన్ మోసాలు పెరిగాయి... ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి అనిత




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : "గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండండి. క్షణికావేశంలో వాటిని క్లిక్ చేస్తే మీ కష్టార్జితం మొత్తం సైబర్ నేరగాళ్ల పాలవుతుంది" అంటూ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రజలను తీవ్రంగా హెచ్చరించారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయని, సాంకేతికతను మంచి కోసం ఎంతగా వాడుతున్నామో, చెడుకు కూడా అంతేస్థాయిలో వినియోగిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో శనివారం జరిగిన 'సురక్షా 360' కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

**టెక్నాలజీతోనే నేరాలకు అడ్డుకట్ట..** సైబర్ నేరాలతో పాటు, భౌతిక నేరాలను కూడా సాంకేతిక పరిజ్ఞానంతోనే అరికట్టగలమని మంత్రి అనిత స్పష్టం చేశారు. "రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతి వీధి, ప్రతి గ్రామాన్ని సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావడమే మా లక్ష్యం. టెక్నాలజీ వినియోగంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందుండటం అభినందనీయం" అని ఆమె అన్నారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి ఏర్పాటుతో రాష్ట్రవ్యాప్తంగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.

**ప్రార్థనా మందిరాలకు 'సురక్షా' కవచం...** ఈ కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన 28 'సురక్షా డివైస్ కిట్ల'ను మంత్రి పంపిణీ చేశారు. ఈ పరికరాల ద్వారా ప్రార్థనా మందిరాల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, "ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజం సాధ్యం. 'సురక్షా 360' కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేసి, ప్రతి పౌరుడికి భద్రతాభావం కల్పిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వర రావు, ఇతర ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్..



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :ఏపీ బీజేపీ అధ్యక్ష పదవిపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. పార్టీ రాష్ట్ర నూతన సారథిగా మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర బీజేపీలో నాయకత్వ మార్పు ఖాయమైంది. అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను మంగళవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధికారికంగా నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కర్ణాటకకు చెందిన ఎంపీ మోహన్‌ను ఎన్నికల పరిశీలకుడిగా నియమించారు. ఇందులో భాగంగా పీవీఎన్ మాధవ్ ఈ రోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. పీవీఎన్ మాధవ్‌కు పార్టీలో, అనుబంధ సంస్థల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆయన శాసన మండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) సేవలందించడమే కాకుండా, మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థి దశ నుంచే ఆర్ఎస్ఎస్‌లో చురుకుగా పనిచేసిన ఆయన, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)లో కూడా పనిచేశారు. మాధవ్ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి, దివంగత నేత చలపతిరావు బీజేపీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. చలపతిరావు కూడా గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేశారు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని, పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పీవీఎన్ మాధవ్ ఇప్పుడు రాష్ట్ర అధ్యక్ష పదవిని చేపట్టబోతున్నారు.

## అంతరిక్షంలో 'భారత్ మాతా కీ జై'.. శుభాంశు శుక్లాతో మాట్లాడిన ప్రధాని మోదీ!



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నాడు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సంభాషణలో భాగంగా శుక్లా 'భారత్ మాతా కీ జై' అని నినదించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. శుభాంశు శుక్లా ప్రయాణం దేశ ప్రతిష్ఠను మరింత పెంచిందని కొనియాడారు. "మీరు మిషన్ కోసం భౌతికంగా దేశానికి దూరంగా ఉన్నప్పటికీ, 140 కోట్ల మంది భారతీయుల హృదయాలకు చాలా దగ్గరగా ఉన్నారు. మీ ఈ చారిత్రక యాత్ర ఒక నూతన శకానికి నాంది పలుకుతుంది. ఇది మన దేశ మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు మొదటి అడుగు వంటిది. అంతరిక్షాన్ని అన్వేషించాలనే భారత విద్యార్థుల ఆకాంక్షలకు మీ విజయం మరింత బలాన్నిస్తుంది" అని శుక్లాను ఉద్దేశించి ప్రధాని అన్నారు. ఈ ప్రయాణం వికసిత భారత్ లక్ష్యానికి నూతన ఉత్తేజాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ప్రశంసలకు శుభాంశు శుక్లా వినమ్రంగా స్పందించారు. ఇది తన ఒక్కడి విజయం కాదని, యావత్ భారతదేశం సాధించిన సమష్టి విజయమని అన్నారు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం నాకు గర్వకారణంగా ఉంది. ఇక్కడి నుంచి మన దేశాన్ని మొదటిసారి చూసినప్పుడు, మ్యాప్‌లో చూసిన దానికంటే ఎంతో పెద్దదిగా, మహోన్నతంగా కనిపించింది. ఈ భూమి అంతా ఒకే ఇల్లు, మనమంతా ఒకే కుటుంబం అనే భావన కలుగుతోంది. ఇక్కడి నుంచి చూస్తే దేశాల మధ్య సరిహద్దులు, విభజన రేఖలు కనిపించవు, అంతా ఏకత్వమే కనిపిస్తుంది" అని తన అనుభూతిని పంచుకున్నారు. అమెరికాకు చెందిన యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వాయుసేనకు చెందిన శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లారు. ఆయనతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నీవ్‌స్కీ, హంగేరీకి చెందిన టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

## సార్క్‌కు పోటీగా చైనా-పాక్ కొత్త కూటమి ఎత్తుగడ.. ఖండించిన బంగ్లాదేశ్

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : దక్షిణాసియాలో దశాబ్దాలుగా కీలక పాత్ర పోషించిన సార్క్ కూటమికి ప్రత్యామ్నాయంగా మరో కొత్త గ్రూప్‌ను ఏర్పాటు చేసేందుకు చైనా, పాకిస్థాన్‌లు తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్వీర్యంగా ఉన్న సార్క్ స్థానంలో ఈ కొత్త వేదికను తీసుకురావాలన్నది వారి వ్యూహంగా కనిపిస్తోంది. ఈ మేరకు పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' దౌత్యవేత్తలను ఉటంకిస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. పాకిస్థానీ మీడియా కథనం ప్రకారం, ఈ కొత్త కూటమి ఏర్పాటుపై చైనా, పాకిస్థాన్‌ల మధ్య ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిగాయి. ఇందులో భాగంగానే ఇటీవల చైనాలోని కున్మింగ్ నగరంలో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. సార్క్‌లోని మిగతా దేశాలైన శ్రీలంక, మాల్దీవులు, అఫ్గానిస్థాన్‌లను కూడా ఈ కొత్త కూటమిలోకి ఆహ్వానించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు సమాచారం. వాణిజ్యం, దేశాల మధ్య అనుసంధానం పెంచుకోవడం ద్వారా ప్రాంతీయ సంబంధాలను బలోపేతం చేయాలన్నది ఈ కొత్త గ్రూపు ప్రధాన ఉద్దేశమని ఆ పత్రిక పేర్కొంది. కొట్టిపారేసిన బంగ్లాదేశ్.. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఈ ప్రచారాన్ని ఖండించింది. చైనాలో జరిగింది రాజకీయ సమావేశం కాదని, ఎలాంటి కొత్త కూటమిని ఏర్పాటు చేయడం లేదని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం. తౌఫిద్ హొస్సైన్ మాట్లాడుతూ, "మేము ఏ కొత్త కూటమిని ఏర్పాటు చేయడం లేదు" అని తేల్చిచెప్పారు. దీంతో ఈ వ్యవహారంపై మరింత ఆసక్తి పెరిగింది. మరోవైపు, ఈ కొత్త గ్రూప్‌లోకి భారత్‌ను కూడా ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. భారత్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక సభ్యదేశాలుగా ఉన్న సార్క్ కూటమి గత కొన్నేళ్లుగా అచేతనంగా మారింది. 2016లో పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన సార్క్ శిఖరాగ్ర సమావేశం యూరీలో ఉగ్రదాడి కారణంగా రద్దయింది. ఆ దాడి నేపథ్యంలో సదస్సులో పాల్గొనేందుకు భారత్ నిరాకరించింది. ఆ తర్వాత బంగ్లాదేశ్, భూటాన్, అఫ్గానిస్థాన్‌లు కూడా భారత్‌కు మద్దతుగా సదస్సును బహిష్కరించాయి. అప్పటి నుంచి సార్క్ సమావేశాలు జరగలేదు.

## అత్యవసర పరిస్థితి అనేది కాంగ్రెస్ అధికార దాహంతో అన్యాయం చేసిన యుగం : అమిత్ షా




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : జూన్ 25, 1975, భారతదేశ రాజ్యాంగ చరిత్రలో ఒక తేదీ మాత్రమే కాదు, అధికార దాహంలో ప్రజాస్వామ్యం యొక్క ఆత్మ నలిగిపోయిన చీకటి రోజు. ఇది కేవలం 'అత్యవసర పరిస్థితి' కాదని, అధికార దాహంతో ఉన్న కాంగ్రెస్ తన సింహాసనాన్ని కాపాడుకోవడానికి చేసిన చివరి, తీరని ప్రయత్నం అని, జాతీయ భద్రత అనే తప్పుడు సాకుతో దేశంపై బలవంతంగా రుద్దబడిన అన్యాయ కాలం అని కేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి మరియు సీనియర్ బిజెపి నాయకుడు అమిత్ షా నిస్సందేహంగా స్పష్టం చేశారు. ఈ చీకటి అధ్యాయం భావ ప్రకటనా స్వేచ్ఛను గొంతు నొక్కడమే కాదుబీ అది న్యాయవ్యవస్థను చెవిటివాడిని చేసి, పత్రికలను మసకబారింది. 21 నెలల పాటు, ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక నిశ్శబ్దం మొత్తం దేశంపై వ్యాపించి, భారత పౌరులను వారి స్వంత భూమిలో ఖైదీలుగా మార్చింది. భారత ప్రభుత్వం ఈ రోజును 'సంవిధాన్ హత్య దివస్' (రాజ్యాంగ హత్య దినం)గా పాటించాలని నిర్ణయించుకున్నప్పుడు, అది ప్రజాస్వామ్య విలువల రక్షణలో జాతీయ మేల్కొలుపు. దేశం మొత్తం భయం, అణచివేత గుప్పిట్లో ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితి యొక్క అణచివేత చీకటి మధ్య, నేడు భారత ప్రధానమంత్రి అయిన ఒక యువ ప్రచారక్, భూగర్భంలో నివసిస్తున్నప్పుడు ప్రజాస్వామ్య జ్యోతిని పైకి ఎత్తాడు. మారువేషాల్లో, కొన్నిసార్లు సన్యాసిగా, కొన్నిసార్లు వార్తాపత్రిక విక్రేతగా, అతను ప్రజా మేల్కొలుపు స్ఫూర్తిని రగిలించాడు. నేడు, ఆ నాయకుడే 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసం, ఆకాంక్షలు మరియు ఆశల స్వరూపుడు. ఇది కేవలం చారిత్రక వ్యంగ్యం కాదు %-% ఇది కవితా న్యాయం. 'నేనే సర్వోన్నతుడిని' అనే మనస్తత్వంతో బాధపడుతున్న యుగం నుండి 'అన్నింటికంటే ఉన్నతమైన దేశం' అనే పిలుపు ప్రజల మనస్సాక్షిగా మారిన కొత్త యుగానికి మార్పు. ప్రధాని మోదీ ప్రజాభిప్రాయాన్ని సూచిస్తే, ఆయన అత్యంత విశ్వసనీయ వ్యూహకర్త, ప్రజాస్వామ్యానికి దృఢమైన రక్షకుడు మరియు ఆధునిక భారతదేశ చాణక్య అమిత్ షా, ప్రజాస్వామ్యాన్ని కేవలం ఒక వ్యవస్థగా కాకుండా, భారతీయ జీవన విధానంలో అంతర్భాగంగా చూసే ఆ స్ఫూర్తికి అప్రమత్తమైన సంరక్షకుడు. 'సంవిధాన్ హత్య దివస్' అనే జాతీయ కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగం కేవలం ప్రసంగం కాదు, అది ప్రజాస్వామ్యానికి పునర్నిర్వచనం. జూన్ 24, 1975 రాత్రి భారత చరిత్రలో అత్యంత చీకటి రాత్రి అని, ఆ రాత్రి ప్రజాస్వామ్యం 21 నెలల పాటు మసకబారిపోయిందని ఆయన దేశానికి గుర్తు చేశారు. వంటగది మంత్రివర్గం ఆదేశం మేరకు, పార్లమెంటు లేదా క్యాబినెట్ ఆమోదం లేకుండా, ఒకే సంతకం రాజ్యాంగాన్ని మసకబారింది. రాజ్యాంగ సభను రూపొందించడానికి 2 సంవత్సరాలు, 11 నెలలు మరియు 18 రోజులు పట్టిన అదే రాజ్యాంగం, ఒక డిక్రీతో కుంటుపడింది. 1.10 లక్షలకు పైగా రాజకీయ మరియు సామాజిక కార్యకర్తలను జైలులో పెట్టారు, 1 కోటి మందికి పైగా పౌరులను బలవంతంగా క్రిమిరహితం చేశారు మరియు 253 మంది జర్నలిస్టులను అరెస్టు చేశారు. సెన్సార్‌షిప్ పత్రికలను ఎంతగా దెబ్బతీసిందంటే, వార్తాపత్రికల సంపాదకీయ పేజీలు ఖాళీగా ముద్రించడం ప్రారంభమైంది. సంబంధిత ప్రశ్న ఏమిటంటే, దేశం నిజంగా ప్రమాదంలో ఉందా? లేదా సింహాసనం జారిపోతుందా? నేడు, చరిత్రే దీనికి సమాధానం ఇస్తుంది. ఈ సంక్షోభం ఎప్పుడూ దేశం గురించి కాదు, ఇది ఒక కుటుంబ శక్తి మనుగడ గురించి. కొన్ని పార్టీలు ఇప్పుడు రాజ్యాంగాన్ని రక్షించడం గురించి పదే పదే మాట్లాడుతుండగా, 1975లో దానిని హత్య చేసిన చేతులు ఒకటేనని గుర్తుంచుకోవాలి. పార్లమెంట్, న్యాయవ్యవస్థ, పత్రికలు అన్నీ లొంగదీసుకోవడానికి ప్రయత్నించబడ్డాయి. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని సమర్థిస్తున్న పార్టీలు అప్పట్లో పాలనతో నిలబడి దాని నుండి ప్రయోజనం పొందాయి. కాంగ్రెస్ రాజకీయ క్షీణత ఆ యుగంలో ప్రారంభమైందనేది కూడా చారిత్రక సత్యం, ఈ క్షీణత ఇప్పుడు దానిని అసంబద్ధత అంచుకు తీసుకువచ్చింది. అత్యవసర పరిస్థితి కేవలం చరిత్ర పుస్తకాలలో ఒక అధ్యాయం కాదు, ప్రజాస్వామ్యానికి ఎల్లప్పుడూ అప్రమత్తమైన సంరక్షకులు అవసరమని ఇది ఒక హెచ్చరిక. ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో, భారతదేశం 'వలసవాద మనస్తత్వం' నుండి విముక్తి పొందాలని ప్రతిజ్ఞ చేసింది. గతంలో జరిగిన తప్పులను మనం గుర్తుంచుకోవడమే కాకుండా వాటి నుండి నేర్చుకున్నప్పుడే ఆ ప్రతిజ్ఞ నెరవేరుతుంది. నేడు, భారతదేశం 'నేను' కాదు, 'మనం' అనే స్ఫూర్తితో నాయకత్వం వహించే యుగంలోకి అడుగుపెట్టింది. మరియు ఈ పరివర్తన కేవలం రాజకీయం కాదు, ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలోని సాంస్కృతిక మరియు జాతీయ స్పృహ యొక్క పునరుజ్జీవనం.

# ప్రపంచ వేదికపై పోటీకి సిద్ధంగా మన ఎంఎస్ఎంఈలు

***తిరుపతిలో 101 వ్యాపార ఒప్పందాలు***

***గ్లోబల్ మార్కెట్ల దిశగా ఏపీ ఎంఎస్ఎంఈల ప్రయాణం***



తిరుపతి,నేటి పత్రిక ప్రజావార్త : తిరుపతిలో ముగిసిన అంతర్జాతీయ రివర్స్ బయ్యర్–సెల్లర్ మీట్ ఆలంబనగా రాష్ట్ర ఎంఎస్ఎంఈలకు గ్లోబల్ మార్కెట్లలో వ్యాపార అవకాశాలకు మార్గం సుగమం అయ్యింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ బిజినెస్ మీట్‌లో 101 వ్యాపార ఒప్పందాలు జరిగటం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇందులో 40 మంది తొలిసారి ఎగుమతిదారులు, 38 మంది మహిళా పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వడం విశేషం. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి శ్కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈలు ఇప్పుడు కేవలం దేశీయ మార్కెట్లకే పరిమితం కావడం లేదని, ప్రపంచ వేదికపై పోటీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఈ రంగాన్ని గ్లోబల్ లెవల్‌కి తీసుకెళ్లేందుకు అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఈ రివర్స్ బయ్యర్–సెల్లర్ మీట్‌ను ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ తో కలిసి నిర్వహించింది. ఇందులో రాష్ట్రంలోని 350కి పైగా ఎంఎస్ఎంఈలు పాల్గొనగా, అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, జీసీసీ దేశాలు, ఆఫ్రికా, ఆగ్నేయాసియాలోని 30 అంతర్జాతీయ కొనుగోలు దారులు హాజరయ్యారు. అంతర్జాతీయ ప్రమాణాలు, గ్లోబల్ మార్కెట్ అంచనాలు, నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించడంతో పాటు, విదేశీ వ్యాపార భాగస్వాములతో నేరుగా సంప్రదించే అవకాశాన్ని ఈ కార్యక్రమం ఎంఎస్ఎంఈలకు కల్పించింది. ముఖ్యంగా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శించి కొనుగోలు దారుల ప్రశంసలు పొందారు. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, సీఈఓ విశ్వ మనోహరన్ మాట్లాడుతూ, ఇలాంటి వేదికలు చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను తెచ్చిపెడుతున్నాయని పేర్కొన్నారు. వీడ్కోలు సమావేశంలో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్ బాబు, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ జాయింట్ డైరెక్టర్ జనరల్ ఉన్నికృష్ణన్‌లు పాల్గొని నాణ్యత సర్టిఫికేషన్లు, నిలకడైన ఆవిష్కరణలు, గ్లోబల్ ప్రిపేర్‌నెస్ వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ మీట్ రాష్ట్ర ఎంఎస్ఎంఈలను ప్రపంచ వ్యాపార రంగంలో మరింతగా బలోపేతం చేయడంలో కీలకంగా నిలిచిందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది: మంత్రి నారాయణ




నెల్లూరు, నేటి పత్రిక ప్రజావార్త : గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ శాఖకు చెందిన సుమారు రూ.3 వేల కోట్ల నిధులను పక్కదారి పట్టించిందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి, రూ.10 లక్షల కోట్ల అప్పులను ప్రజలపై మోపిందని ఆయన విమర్శించారు. సోమవారం నెల్లూరు నగరంలోని 45వ డివిజన్ పొగతోటలో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు అనుభవంతో రాష్ట్రంలో పరిస్థితులు మళ్లీ గాడిన పడుతున్నాయని అన్నారు. “గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది. రూ.పది లక్షల కోట్ల అప్పు రాష్ట్రానికి మిగిల్చి వెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు అనుభవంతో పరిస్థితులు గాడిన పడుతున్నాయి. వైసీపీ ఆపేసిన అభివృద్ధి పనులన్నీ తిరిగి ప్రారంభిస్తున్నాం” అని ఆయన తెలిపారు. నెల్లూరు నగరంలో 6.7 కిలోమీటర్ల మేర ఉన్న కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించామని, రాబోయే 15 రోజుల్లో ఈ పనులను పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.అలాగే పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు సిద్ధం చేసిన వీఆర్ హైస్కూల్‌లో సోమవారం నుంచే తరగతులు ప్రారంభిస్తున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు. ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పథంలో నిలుపుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ సలహాదారు, ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ అధ్యక్షుడిగా డా.వేమూరు రవికుమార్



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచ వ్యాప్తంగా మా ప్రవాసాంధ్రుల అభ్యున్నతికి, రాష్ట్రాభివృద్ధికి దోహదపడే విధంగా ఏపీఎన్ఆర్టీని తీర్చిదిద్దుతానని ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ అధ్యక్షులు డా.వేమూరు రవికుమార్ తెలిపారు. తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిలా నిలిచిపోయేలా ఏపీఎన్ఆర్టీ ఆధ్వర్యంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. జన్మభూమి పథకంలో నాడు ఎన్ఆర్ఐలు భాగస్వాములై గ్రామాల రూపురేకల మార్పునకు కృషి చేశారు. ఇప్పుడు పీ4 విధానంలో భాగస్వాములై పేదరిక నిర్మూలనుకు కృషి చేస్తారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏపీ ఎన్ఆర్టీ ద్వారా ఖండాంత్రాలు దాటి తెలుగు ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు మరియు ఏపీఎన్ఆర్టీ సొసైటీ అధ్యక్షులుగా డా.వేమూరు రవికుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు వాళ్లు ఎక్కడున్నా నంబర్ వన్ గా ఉండాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమనికి అనుగుణంగా, ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు తాము పనిచేస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ఎన్నారైలను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములుగా చేస్తామని.., ఉద్యోగస్తులుగా ఉన్న ఎన్నారైలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తామన్నారు. దీంతో పాటు విదేశాల్లో ఉన్న మన విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చేలా మెరుగైన ప్రణాళికలు రూపొందించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రముఖ సంస్థల్లో అత్యున్నతస్థానాల్లో ఉన్న తెలుగు వారందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి మన విద్యార్థులకు ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఇందుకోసం మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం మేరకు స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సహకారంతో అవసరమైన శిక్షణా కార్యక్రమాలను చేపట్టడంతో పాటు.. మన తెలుగు విద్యార్థులు విదేశాల్లో ఉగ్యోగాలు సాధించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. ఇందుకోసం వివిధ దేశాల్లోని మన రాష్ట్ర ప్రభుత్వ కో–ఆర్డినేటర్లతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని డా.వేమూరు రవి కుమార్ తెలిపారు

# నిజాలు బయటపడుతుంటే ట్యాపింగ్ దొంగలకు భయం పట్టుకుంది...: షర్మిల



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై వార్తలు ప్రసారం చేస్తున్న మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడడాన్ని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఖండించారు. వాస్తవాలను వెలికితీస్తున్న మీడియా సంస్థపై భౌతిక దాడులకు దిగడం అప్రజాస్వామికమని ఆమె అన్నారు. “తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ పై వాస్తవాలను ప్రసారం చేస్తున్న మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై, బీఆర్ఎస్ గూండాల దాడిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఛానెల్ లో పనిచేసే సిబ్బందిపై, ముఖ్యంగా మహిళా జర్నలిస్టుల మీద దాడి హేయమైన చర్య. ఇలాంటి దాడులు మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తాయి. నా ఫోన్ ట్యాప్ చేశారు. ట్యాప్ చేసిన ఆడియోనే వైవీ సుబ్బారెడ్డి గారు నాకు వినిపించారు. ఉన్నమాట అంటే ఉలుకెక్కువ అన్నట్లు... ఫోన్ ట్యాపింగ్ విషయంలో మీ దొంగ చెవులను పసిగడుతుంటే దాడులకు దిగుతారా? వాస్తవాలు చెప్పే వాళ్లను చంపాలని చూస్తారా? అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎవరి ఫోన్లనైనా ట్యాప్ చేయవచ్చా? అడిగినోళ్లకు సైతం ట్యాప్ చేసిన కాల్ రికార్డ్స్ పంపవచ్చా? దొంగతనంగా ఫోన్లు ట్యాప్ చేసి నీచానికి ఒడిగడతారా? తీగ లాగుతుంటే డొంక కదులుతుంది అన్నట్లు సిట్ విచారణలో నిజాలన్నీ బయట పడుతుంటే, ట్యాపింగ్ దొంగలకు భయం పట్టుకుంది. తక్షణమే మహా న్యూస్ యాజమాన్యానికి బీఆర్ఎస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం” అని షర్మిల స్పష్టం చేశారు.

# తెలుగు భాషీయుల సంఖ్య మళ్ళీ దేశంలో రెండో స్థానాన్ని పొందాలి

***-రాష్ట్రేతర ఆంధ్రులు తెలుగు చదవటం రాయటం నేర్చుకోవాలి : డాక్టర్ మండలి బుద్ధప్రసాద్***

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : జనగణనలో తెలుగు భాషీయులగా నమోదు చేసుకుని తిరిగి దేశంలో రెండవ స్థానానికి తెలుగు చేరేలా రాష్ట్రేతర ఆంధ్రులు కృషి చేయాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కేరళ రాష్ట్రం ఎర్నాకులం కడవంత్రలో ఉన్న గిరినగర్ కమ్యూనిటీ హాలులో జాతీయ సదస్సు జరిగింది. రాష్ట్రేతర తెలుగు సమాఖ్య, ఆంధ్ర సాంస్కృతిక సంఘం – కొచ్చిన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రేతర తెలుగు సంఘం పదవ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ సదస్సు నిర్వహించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్ ప్రసంగిస్తూ ఆధునిక కాలంలో వృత్తి, వ్యాపార రీత్యా వలసలతో ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన తెలుగు వారి సంఖ్య దాదాపు ఉమ్మడి తెలుగు రాష్ట్ర జనాభాకు సమానంగా ఉంటుందన్నారు. రాష్ట్రేతర ఆంధ్రులు తాము స్థిరపడిన ప్రాంతాల భాషా సంస్కృతులను నేర్చుకుంటూనే తమ మాతృభాషను కొనసాగించాలని తహతహలాడుతున్నారని తెలిపారు. వారిలో చాలా మంది తెలుగును మాట్లాడతారు కానీ వ్రాయటం, చదవటం రాదన్నారు. ఇతర రాష్ట్రాలలో నివసిస్తున్న తెలుగు వారి మాతృ భాషా సంస్కృతులను పరిరక్షించటానికి 2015లో ఏర్పడిన రాష్ట్రేతర తెలుగు సమాఖ్య దేశ వ్యాప్తంగా సభ్యులు కలిగి వివిధ ప్రాంతాలలో క్రియాశీలకంగా ఉన్న తెలుగు సంస్థలు రాష్ట్రేతర తెలుగు సమాఖ్యకు అనుబంధంగా ఇతర తెలుగు సంస్థల సమన్వయంతో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వాలు, అనేక తెలుగు సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. కానీ సుదూర ప్రాంతాలు కావటం, కొన్నిచోట్ల స్థానిక భాషల ఆధిపత్య ధోరణులతో తెలుగు నేర్చుకోవటం కుంటుపడిందన్నారు. ఈ సందర్భంలో రాష్ట్రేతర తెలుగు భాషా సంస్థలు తెలుగు భాషా నిష్ణాతులతో చర్చించి దేశవ్యాప్తంగా రాష్ట్రేతర ప్రాంతాల్లో తెలుగు నేర్పించాల్సిన అవసరాన్ని గుర్తించినట్లు తెలిపారు.

తదనుగుణంగా ఇతర రాష్ట్రాలలోని తెలుగు అధ్యాపకులతో ఒక కమిటీ ఏర్పరిచి వారి సూచనలతో ఆచార్య డి.మునిరత్నం నాయుడు నేతృత్వంలో ఐదుగురు నిష్ణాతులైన సభ్యులతో పాఠ్య పుస్తక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలుగు బోధనకు అవసరమైన పాఠ్య ప్రణాళికను రూపొందించి మొదటి తరగతికి తెలుగు, ఆంగ్ల, హిందీ భాషల అక్షరాల ద్వారా తెలుగు భాషను తేలికగా అభ్యసించే విధంగా ప్రత్యేక పుస్తకం తయారు చేసినట్లు తెలిపారు. ఈ పుస్తకం ఆన్లైన్లో అభ్యసించే వారికీ, ప్రత్యక్ష బోధనకు కూడా ఉపయోగపడుతుందన్నారు.



రాష్ట్రేతర తెలుగు సమాఖ్య ద్వారా ప్రారంభించబోయే తెలుగు బోధనకు సంబంధించిన కోర్సుకు ప్రభుత్వ సంస్థల గుర్తింపు కోసం ప్రయత్నం జరుగుతోందని వివరించారు. తెలుగు వెలుగు వాచక పుస్తకం తయారీలో సహకరించిన అధ్యాపకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రేతర ఆంధ్రుల పిల్లలకు ఈ పుస్తకం ద్వారా తెలుగు నేర్పించే ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. తెలుగు భాష నేర్పించడమే కాకుండా వారికి సర్టిఫికెట్లు ఇస్తే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు.

పార్లమెంటు సభ్యులు గోపీనాథ్ మాట్లాడుతూ తమిళనాడులో తమిళాన్ని నిర్బంధంగా నేర్పిన విధంగా తెలుగు రాష్ట్రాల్లో తెలుగుని నేర్పించకపోతే భాష మనుగడ ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. జనగణనలో తెలుగు మాతృభాషగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు.డాక్టర్ మునిరత్నం నాయుడు మాట్లాడుతూ రాష్ట్రేతర ఆంధ్రులు ప్రతి ఒక్కరూ భాషా సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సాహిత్య గోష్టికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య డాక్టర్ వెలుదండ నిత్యానందరావు, సమన్వయకర్తగా డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి వ్యవహరించారు.

ఈ సందర్భంగా రాష్ట్రేతర తెలుగు సంఘం ప్రచురించిన “తెలుగు వెలుగు” వాచకాన్ని మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. సాయంత్రం దశమ వార్షికోత్సవ శుభారంభం సందర్భంగా జ్యోతుల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ సదస్సు ప్రారంభ సభకు కొచ్చిన్ ఆంధ్ర సాంస్కృతిక సంఘం అధ్యక్షులు ఎం.హరి హర నాయుడు స్వాగతం పలికారు. రాష్ట్రేతర తెలుగు సంఘం అధ్యక్షులు రాళ్లపల్లి సుందర రావు అధ్యక్ష ఉపన్యాసం చేశారు. రాష్ట్రేతర తెలుగు సంఘం కార్యదర్శి పీవీపీసీ ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

**నీ వెనుకేముంది... ముందేముంది...**
**అనేది నీ కనవసరం....**
**నీలో ఏముంది అనేది ముఖ్యం...**



# నిజం గడప దాటేలోగా... అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది... అప్రమత్తంగా ఉండండి -టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీడీపీ కార్యాచరణ చేపట్టింది. ఈ కార్యక్రమంలో పార్టీ అధినాయకత్వం మొదలుకుని పార్టీ కార్యకర్త వరకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ను నెల రోజులు చేపట్టేలా టీడీపీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. దీనికి సన్నాహక సమావేశంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పరిశీలకులతో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. “ఏడాది కాలంగా ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేసింది. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. ప్రత్యర్థులు రాష్ట్రాన్ని ఇబ్బంది పెట్టేలా అమలు చేస్తున్న కుట్రలను కూడా ప్రజలకు వివరించాలి. విధ్వంసమైన రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్తామని ఎన్నికల ముందు తాను, పవన్ కళ్యాణ్ మాటిచ్చాం. ప్రజలు నమ్మి 94 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాన్ని కట్టబెట్టారు. నమ్మి ఆదరించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనపై ఉంది.” అని చంద్రబాబు వెల్లడించారు.

**ప్రజల్లోకి వెళ్లడానికి నామోషీ వద్దు..** ‘ప్రజల్లోకి నామోషీ లేకుండా వెళ్లి ప్రభుత్వం చేసిన పనుల్ని వివరించండి. చేసిన పనులు చెప్పడంతో పాటు.. అమలు కాని పనులు ఎందుకు అవ్వలేదో చెప్పాల్సిన బాధ్యత కూడా మనపై ఉంది. ప్రజలకు ఎంత అందుబాటులో ఉంటే వారు అంత ఆదరిస్తారు. పనిచేయడం ఎన్నికల సమయంలో ప్రత్యర్థులు దౌర్జన్యాలు చేసినా ప్రజలు కూటమికి అండగా నిలబడ్డారు. నిర్మొహమాటకుండా వ్యవహరించి గెలుపే ధ్యేయంగా అభ్యర్థులను ఎంపిక చేశాం. సోషల్ రీ–ఇంజనీరింగ్ చేశాం. 2014లో అభివృద్ధి, సంక్షేమ పనులు చేశాం. కానీ రాజకీయం మరిచిపోయాం. చేసింది చెప్పుకోలేకపోయాం. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఎప్పటికప్పుడు చేసిన పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మనోభావాలకు అనుగుణంగా వ్యవహరించాలి.’ అని సీఎం చంద్రబాబు సూచించారు.

**నాటి తప్పులు పునరావృతం కాకూడదు..** “2014లో రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితులు చక్కదిద్దుకుంటూ ఎవరికీ ఇబ్బంది లేకుండా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా చేసి చూపించాం. కానీ చాపకింద నీరులా టీడీపీపై అబద్ధాలు చెప్పారు. లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు చెప్పి ప్రజలను తప్పుదారి పట్టించారు. కుట్రలు పన్నారు. 2019 ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న వివేకానందరెడ్డి హత్యే ఉదాహరణ. సాక్షిలో గుండెపోటుతో చనిపోయారని ప్రసారం చేశారు. నేను కూడా నిజమేనేమో అనుకున్నాను. హత్య చేసిన వాళ్లు జాగ్రత్త పడ్డారు. కంట్రోల్ చేయాల్సిన మనం ఏమరపాటుకు గురయ్యాం. బెడ్రూం, బాత్రూంలో రక్తం కడిగి శవానికి కుట్లు వేయించి ఫ్రీజర్‌లో పెట్టారు. పోస్టుమార్టం చేయాలని వివేకా కూతురు సునీతారెడ్డి అడిగి తర్వాత పోస్టుమార్టం చేయగా గొడ్డలివేటని తేలింది. మనం చేస్తున్న మంచిని ఏ స్థాయిలో వివరిస్తున్నామో.. వారి కుట్రలను కూడా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది.” అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**అందరి గురించి తెలుసు... సర్వేలు చేయిస్తున్నా..** “ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరు, పాలన గురించి చాలా రకాలుగా సర్వేలు చేయిస్తున్నా. ఏదో ఒక్క సర్వే కాదు.. రకరకాల మార్గాల్లో సర్వేలు చేయిస్తున్నా. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో రియల్ టైమ్‌లో తెలుసుకుంటున్నా. ఏ నాయకుడు ఏ విధంగా ప్రజలకు పనులు చేస్తున్నారో కూడా తెలుసుకుంటున్నా. మనం ఏం చేశామనే అంశంతో పాటు.. ప్రజలు, కార్యకర్తలతో ఎలా వ్యవహరిస్తారోననేది కూడా ముఖ్యం. కష్టపడి పని చేసే వారికి మంచి పదవులు దక్కుతాయి. ఏడాది ముందు ఎన్నికల కోసం పని చేస్తే ప్రజలు నమ్మరు. పార్టీ కోసం అంకితమై పనిచేసే వారిని గుర్తించేకుని పని యాల్సిన బాధ్యత మనపై ఉంది. వారసులైనా సరే.. పని చేస్తేనే వారికి పదవులు వస్తాయి. లేకుంటే వారికో నమస్కారం పెట్టేస్తాను. ఎర్రన్నాయుడు పార్టీ కోసం పని చేశారు.. రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రి అయ్యారు. బాలయోగి మరణించిన సమయంలో హరీష్ చిన్నవాడు. ఇప్పుడు ఆయనకు సీటు ఇచ్చి ఎంపీ చేశాం. మాకు వారసత్వ ఉంది, పని చేయం అని చెప్తే కుదరదు.

**ఎమ్మెల్యేలతో భేటీలు నిర్వహిస్తా....** “ఎమ్మెల్యేలతో భేటీ అవుతాను. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలతో ముఖాముఖి అయ్యాను. ఎమ్మెల్యేలు చెప్పింది ఓపిగ్గా వింటా.. వారు చెప్పిన వాటిల్లో ఆచరించదగ్గవి ఉంటే అమలు చేస్తా. అలాగే ఎమ్మెల్యేల్లో ఏమైనా తప్పులుంటే వారికే చెబుతా. సరిచేసుకోవడానికి టైమ్ ఇస్తా. ఎలా సరిచేసుకోవాలోననే అంశంపై సలహాలు, సూచనలు చేస్తా. ఎన్నికల్లో డబ్బులు పంచడం బాధాకరం. పింఛన్లు ఇచ్చి, ఊరూరా రోడ్లు వేసి, అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసి కూడా డబ్బులు పంచాలనుకోవడం మంచిది కాదు. ప్రజలకు అందుబాటులో ఉంటారో వారికే ప్రజలు ఓట్లు వేస్తారు. గత ఎన్నికల్లో ప్రత్యర్థులు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేసినా 11 సీట్లు మాత్రమే వచ్చాయి. అన్నింటికీ డబ్బులు పనిచేయవు. ఆదర్శవంతమైన, అభివృద్ధి రాజకీయాలు చేద్దాం.” అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు..** “వైకుఠంపాళి అభివృద్ధి వద్దు. సుస్థిర ప్రభుత్వం ఉండటం చాలాముఖ్యం. సింగపూర్‌లో 60 ఏళ్లుగా ఒకేపార్టీ అధికారంలో ఉంది. 2004, 2019లో టీడీపీ మళ్లీ గెలిచి ఉంటే రాష్ట్ర రూపురేఖలు మారేవి. గత పాలకుల వల్ల రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. దీన్ని తిరిగి రాబట్టాలంటే కొంత సమయం పడుతుంది. మన ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెడుతున్నారు. ఏడాదిలో రూ.9.34 వేలకోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా 8.50 లక్షల ఉద్యోగాలు వస్తాయి. టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్, ఆర్సెలార్ మిట్టల్, జిందాల్, ఎల్జీ వంటి కంపెనీలు వచ్చాయి. సీమలో ఎయిరో స్పేస్, డిఫెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం. పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ కింద 20 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నాం. ప్రజలకు ఇచ్చిన ప్రకారం విధ్వంసం నుంచి వికాసం వైపు మళ్లాం. ఏడాదిలో అన్నీ చేశామని చెప్పడం లేదు. అందుకే సుపరిపాలనలో తొలి అడుగు అని చెప్తున్నాం. 2014, 2024లో కూడా కేంద్రం నుంచి సహకారం అందిన సహకారాన్ని రాష్ట్రాభివృద్ధికి ఉపయోగించుకుంటున్నాం. కేంద్ర సహకారం లేకుంటే వెంటిలేటర్‌పై నుంచి వచ్చే అవకాశం కూడా ఉండేది కాదు. గత ప్రభుత్వంలో జరిగిన విధ్వంసంతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కివెళ్లింది.’ అని చంద్రబాబు అన్నారు.

**సంక్షేమంలో మనమే.. అభివృద్ధిలోనూ మనమే...** ‘దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. ఏడాదిలో రూ.34 వేల కోట్లు అందించాం. మత్స్యకార భరోసా కింద రూ.250 కోట్లు ఇచ్చాం. తల్లికి వందనం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు పథకం వర్తింపజేశాం. దీపం–2 పథకం కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. కోకోకు రైతులకు కిలోకు రూ.50, మామిడికి కేజీకి రూ.4లు ఇస్తున్నాం. పొగాకును కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. 16,347 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ కూడా ఇచ్చాం. ఎక్కడా పొరపాట్లు దొర్లకుండా పరీక్షలు నిర్వహిస్తున్నాం. 204 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5లకే పేదవాడి ఆకలి తీరుస్తున్నాం. వచ్చే నెల కేంద్రం పీఎం కిసాన్ ఇస్తుంది. అదే రోజున రాష్ట్రం తరపున అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు కూడా రైతులకు ఇస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. అర్చకులకు రూ.15 వేలు, నాయీ బ్రాహ్మణులకు రూ.15 వేలు, పాస్టర్లకు రూ.5వేలు, ఇమామ్ మౌజన్లకు రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నాం. అమరావతికి కేంద్రం రూ.15 వేల కోట్లు సాయం చేసింది. పనులు వేగంగా సాగుతున్నాయి. ఏడాదిన్నరలో పోలవరం పూర్తవతుంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,400 కోట్లు కేటాయించింది. నష్టాల్లో ఉన్న ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకొచ్చాం. కొప్పర్తి, ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసుకుంటున్నాం. వాట్సాప్ గవర్నన్స్ సేవలను ఆగస్టు నెలకు 703కు పెంచుతాం. టెక్నాలజీ వాడకంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉంది. దేశంలోనే మొదటిసారి క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం.” అని చంద్రబాబు అన్నారు.

**రాజకీయ ముసుగేసుకున్న క్రిమినల్సుతో నష్టం..** ‘రానురాను రాజకీయాలు పూర్తిగా మారిపోతున్నాయని, ఆర్థిక ఉగ్రవాదులు రాజకీయాల్లోకి వచ్చారు. రాజకీయ ముసుగు వేసుకుని నేరస్తులు తిరుగుతున్నారు. రౌడీలు రాజకీయ ముసుగువేకున్నప్పుడు అప్రమత్తంగా ఉండకపోతే ప్రమాదం ఏర్పడుతుంది. దీనికి 2019 ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న వివేకానందరెడ్డి హత్యే ఉదాహరణ. కోడికత్తి డ్రామా ఆడారు. అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు గులకరాయి డ్రామా ఆడారు. ఇప్పుడు మళ్లీ ప్రతిపక్షంలోకి వచ్చాక ఇంటిముందు గడ్డికాలి పోయింది, సెక్యూరిటీ లేదు అని గోల చేస్తున్నారు. ప్రజల భద్రతే నాకు ఎన్డీయే ప్రభుత్వానికి ముఖ్యం. కులం, మతం పేరుతో రెచ్చగొడుతున్నారు. పాస్టర్ రోడ్డు ప్రమాదంలో చనిపోతే పోలీసులు చంపారని అంటున్నారు. ఆధారాలు ఇవ్వమంటే ఇవ్వరు. తప్పుడు ప్రచారాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉం డండి. దేశంలో ఏ పార్టీ పేపరు, టీవీ పెట్టలేదు. ఏ పార్టీ ఇలా బరితెగించి ప్రవర్తించడంలేదు. పేపరు, టీవీనే కాపాడతాయి అనుకుంటే 11 సీట్లు వచ్చేవి కావు.

**మళ్లీ అదే విషం చిమ్ముతున్నారు..** గతంలో అమరావతి రాజధానిపై విష ప్రచారం చేసి వివిధ సంస్థల నుంచి వచ్చే రుణాలు ఇవ్వకుండా చేశారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఇప్పుడు మైనింగ్‌పై అదే అబద్ధాలు చెప్పి లేఖలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘మద్య నిషేధం చేస్తామని చెప్పి ఆ ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తేవడం తప్పు. కేంద్రం ఎంతివ్వాలో అంతే మొత్తంలో రుణం తీసుకుంటున్నా. కార్యకర్తలు, ప్రజల్లో ఆశలు ఉన్నాయి. 2029లో గెలుపే నా ప్రణాళిక. హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ చేయండి. ఆ స్కిల్స్ మీకు ఉంటే ఎంజాయ్ చేస్తూ పని చేయవచ్చు.


# వాలెక్సియో మరియు మిబెల్యాల ఆవిష్కరణ



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : వ్యవసాయ ఉత్పత్తులలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జర్మనీకి చెందిన కంపెనీ అయిన బిఎఎస్ఎఫ్ అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించబడిన రెండు సరికొత్త ఉత్పాదనలైన వాలెక్సియో మరియు మిబెల్యాలను స్థానిక విజయవాడ హొటల్ ఫ్రైడ్ మాధవ నందు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా బిఎయస్యఫ్ రీసెర్చ్ & డెవలప్మెంట్ సౌత్ ఆసియా హెడ్ నీలాంజన్ సన్యాల్, బిజినెస్ యూనిట్ లీడ్ రమేష్ బాబు, మార్కెటింగ్ మేనేజర్ భార్గవరెడ్డి, ఫీల్డ్ బయాలజిస్ట్ ప్రమోద్, బిజినెస్ డెవలప్మెంట్ లీడ్ మనోజ్ కుమార్, టెరిటరి మేనేజర్ వినయ్ ప్రభాత్ మరియు డిస్ట్రిబ్యూటర్ సాయిదుర్గా ఆగ్రో ఏజెన్సీస్ మాలెంపాటి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బిఎయస్ యఫ్ రీసెర్చ్& డెవలప్మెంట్ సౌత్ ఆసియా హెడ్ నీలాంజన్ సన్యాల్ మాట్లాడుతూ మొదటి ఉత్పాదనైనా వాలెక్సియో కీటకనాశిని వరి పంటలో సుడిదోమ పై దీర్ఘకాలం అత్యంత శక్తివంతంగా పనిచేస్తుందని తెలిపారు. సుదీర్ఘకాలం నమ్మకమైన నియంత్రణ కలిపిస్తుందని మొక్క ఎదుగుదల సర్వోత్తమముగా ఉండడాన్ని పెంపొందిస్తుందని వివరించారు. బిజినెస్ యూనిట్ లీడ్ రమేష్ బాబు మాట్లాడుతూ రెండవ ఉత్పాదనైన మిబెల్యా శిలీంద్రనాశిని గురించి వివరిస్తూ వరి పంటలో వచ్చు పాముపొడ తెగులు నుండి దీర్ఘకాలం రక్షిస్తుందని అలాగే ఉత్పాదక పిలకల శాతాన్ని పెంచే సామర్థ్యాన్ని మొక్కకి అందిస్తుందని తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ వాలెక్సియో మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా భారతదేశంలో తయారైతుందని తెలిపారు. అలాగే వాలెక్సియో డోస్ 60మి.లి/ఎకర మరియు మిబెల్యా డోస్ 120 మి.లీ/ఎకర గా పేర్కొన్నారు.

# ప్రజారోగ్య విభాగం నూతన డైరెక్టర్ గా డాక్టర్ పద్మ శశిధర్

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వైద్యారోగ్య మంత్రిత్వ శాఖలోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం నూతన డైరెక్టర్ (డిపిహెచ్)గా డాక్టర్ పద్మ శశిధర్ నియమితులయ్యారు. రాజమహేంద్రవరంలో రీజనల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న ఈమెను ప్రస్తుత డిపిహెచ్ డాక్టర్ పద్మావతి స్థానంలో నియమించారు. పరిపాలన అవసరాల మేరకు వచ్చిన బదిలీ ప్రతిపాదనల్లో భాగంగా ఈ నియామకాన్ని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారంనాడు ఆమోదించారు. తక్కువ వైద్య సిబ్బంది ఉన్న కొన్ని ఆసుపత్రుల్లో తగు స్థాయిలో వైద్య సేవల కొనసాగింపు మరియు వైద్య విద్యా బోధన అవసరాలు, పాలన సౌలభ్యం నిమిత్తం ఇటీవల జరిగిన బదిలీలకు అదనంగా మరో 33 మంది వైద్య సిబ్బంది బదిలీని మంత్రి ఆమోదించారు. ఇందులో పాడేరు ప్రభుత్వ కళాశాలలో గతేడాది నియమించబడి, వారికిచ్చిన హామీ మేరకు వారి పూర్వ స్థానాలకు బదిలీ చేశారు. అనంతపురం, బాపట్ల మరియు విజయనగరం జిల్లా కలెక్టర్ల వినతి మేరకు ఇటీవల బదిలీ అయిన ఆరుగురు వైద్యుల్ని వారి పూర్వ స్థానాల్లోనే కొనసాగించేందుకు మంత్రి ఆమోదం తెలిపారు. అనంతపురం జిల్లాలోనే వంద పడకల రాయదుర్గం ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు గాను ఆరుగురే పనిచేస్తున్నారు. వీరిలో ఇటీవల ముగ్గురు బదిలీకాగా ఆయా పోస్టుల్లో పనిచేసేందుకు ఎవరూ ముందుకు రానందున వారిని కొనసాగిస్తున్నారు. చీరాల ఏరియా ఆసుపత్రిలో ఐదేళ్లకు మించి పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు బదిలీకాగా ఆయా స్థానాల్లో పనిచేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో వారిద్దర్నీ కొనసాగిస్తున్నారు. విజయనగరం జిల్లాలోనే గిరిజన ప్రాంతంలో ఉన్న సాలూరు ఏరియా ఆసుపత్రిలో బదిలీ అయిన ఒక డాక్టర్ ని స్థానికి అవసరాల మేరకు కొనసాగించాల్సి వచ్చింది. డిఎంఇ పరిధిలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కర్నూలు ప్రభుత్వ వైద్యకళాశాలలో రేడియోథెరపీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకృష్ణ ప్రకాశ్ తప్పనిసరి బదిలీల్లో భాగంగా రాజమహేంద్రవరానికి మారారు. కానీ కర్నూలులో ఆ స్థానానికి ఎవరూ ముందుకు రాలేదు. ఈ కారణంగా కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ కు డైరెక్టర్ గా పనిచేస్తున్న డాక్టర్ శ్రీకృష్ణ ప్రకాశ్‌ను కర్నూలులోనే కొనసాగించాల్సిన అవసరం ఏర్పడింది.



ఈనెల 19 వరకు జరిగిన బదిలీలకు సంబంధించి జారీ అయిన ఆదేశాల్లో కౌన్సిలింగ్‌లో తీసుకున్న నిర్ణయానికి భిన్నంగా ఉత్తర్వులు జారీ అయినందున రెండు సవరణలు అవసరమయ్యాయి. మరో పదిమంది అధ్యాపకులు స్లైడింగ్ కౌన్సిలింగ్ అనంతరం ఏర్పడిన ఖాళీల మేరకు చేసుకున్న దరఖాస్తులను మంత్రి ఆమోదించారు.

**విజయవాడ, గుంటూరు నగరాలకు కొత్త వైద్యాధికారులు..** పరిపాలన అవసరాల కారణంగా చేసిన బదిలీల్లో భాగంగా విశాఖపట్నం ప్రభుత్వ మానసిక వ్యాధుల ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ఎం.హైమావతిని అనకాపల్లి డిఎంహెచ్వోగా నియమించారు. గుంటూరు నగర పాలక సంస్థలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ పి.అమృతం జాన్‌ను ఏలూరు జిల్లా డిఎంహెచ్వోగానూ, ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న డాక్టర్ మాలినిని గుంటూరు నగర పాలక సంస్థకు మార్చారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ కమీషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.అర్జున్‌రావును విజయవాడ నగర పాలక సంస్థలో ముఖ్య వైద్యాధికారిగా బదిలీ చేశారు. ఈనెల 19న వైద్యారోగ్య శాఖ పరిధిలో బదిలీల ప్రక్రియ పూర్తికావాల్సి ఉన్నా ముఖ్యమంత్రి అనుమతితో ఈ తాజా బదిలీలను చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మొత్తం 7,099 మంది వైద్య సిబ్బంది వివిధ స్థాయిల్లో బదిలీ అయ్యారు.

## ఫాక్స్ నట్స్ (మఖానా) - మీరు వాటిని తినడానికి 12 కారణాలు!



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : మనము తేలికపాటి సాయంత్రం అల్పాహారం గురించి ఆలోచించినప్పుడు, ఆరోగ్యకరమైన అల్పాహారం గా ఫాక్స్/లోటస్ గింజలు గుర్తుకు వస్తాయి. వీటిని ఫూల్ మఖానా (పుష్పించే రూపం కారణంగా) మరియు తామర విత్తనాలు అని కూడా పిలుస్తారు. ఫాక్స్ నట్స్ (మఖానా) గొప్ప చిరుతిండి మరియు బహుళ ప్రయోజనాలను కలిగి ఉంది. ఈ అద్భుతమైన, ఆర్థిక, రుచికరమైన మరియు ఆరోగ్యకరమైన వంటకం గురించి తెలుసుకొందం...

**ఫాక్స్ నట్స్/మఖానా యొక్క 12 అద్భుతమైన ప్రయోజనాలు...**

1. ఫాక్స్ నట్స్ (మఖానా) లో కేలరీలు, కొవ్వు మరియు సోడియం తక్కువగా ఉంటాయి. అందువల్ల అవి భోజనం మధ్య అల్పాహారంగా పూర్తి అనుభూతిని కలిగిస్తాయి, అతిగా తినాలి అనే కోరిక తగ్గుతుంది..
2. తక్కువ సోడియం మరియు అధిక పొటాషియం మరియు మెగ్నీషియం కంటెంట్ వలన అధిక రక్తపోటు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటాయి.
3. ఫాక్స్ నట్స్ (మఖానా) లో అధిక కాల్షియం ఉంటుంది కనుక ఎముక మరియు దంతాల ఆరోగ్యానికి మంచిది.
4. వాటిలో చక్కెర శాతం తక్కువగా ఉంటుంది మరియు మధుమేహ వ్యాధిగ్రస్తులకు బాగా ఉపయోగపడుతుంది.
5. ఫాక్స్ గింజలు రక్తస్రావ నివారిణి లక్షణాలను కలిగి ఉంటాయి మరియు మూత్రపిండాల వ్యాధులకు ఉపయోగపడతాయి.
6. వీటిలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. బరువు నిర్వహణ కు తోడ్పడును.
7. ఫాక్స్ నట్స్ (మఖానా) లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది మలబద్ధకం వంటి జీర్ణక్రియ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది..
8. ఫాక్స్ గింజల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వృద్ధాప్యం మరియు శరీరంలో దీర్ఘకాలిక మంట మరియు ఒత్తిడిని ఎదుర్కోవటానికి ఉపయోగపడతాయి
9. స్త్రీ, పురుషులలో మఖానా సంతానోత్పత్తి రేటును మెరుగుపరుస్తుందని నమ్ముతారు. మఖానాను తిన్న స్పెర్మ్ నాణ్యత మరియు పరిమాణం మెరుగుపడుతుంది.
10. అధిక కాల్షియం మరియు ఇనుము వలన గర్భిణీ స్త్రీలకు మఖానా ఇవ్వబడుతుంది. గర్భిణీ తల్లిలో రక్తపోటు మరియు మధుమేహాన్ని నివారించడానికి కూడా ఇది సహాయపడుతుంది.
11. ఫాక్స్ గింజలు నిద్రలేమి కి నివారణగా సహాయపడతాయి.
12. కాఫీ వ్యసనం నుండి బయటపడటానికి కొన్ని ఫాక్స్ గింజలను తినటానికి ప్రయత్నించండి.

**వివిధ రెసిపీలలో ఫాక్స్ నట్స్ (మఖానా) ను ఎలా ఉపయోగించాలి...**

1. ఫాక్స్ నట్స్ (మఖానా) విత్తనాలు వాస్తవానికి రుచిగా ఉంటాయి మరియు అవి ఉప్పు లేదా తీపితో అదనపు రుచిని పొందుతాయి
2. లేత మంట మీద కొద్దిగా నెయ్యితో విత్తనాలను వేయించుకోవాలి. ఉప్పు చల్లుకోండి, రుచికరమైన అల్పాహారం తయారు అవుతుంది.
3. దాల్చిన చెక్క లేదా ఇతర సుగంధ ద్రవ్యాలు ఒకరి అభిరుచికి తగ్గట్టుగా చేర్చవచ్చు.
4. ఖీర్ మరియు ఇతర డెజర్ట్ ల వంటి తీపి వంటలలో కూడా ఫాక్స్ నట్స్ (మఖానా) వాడతారు.

మఖానా ప్రయోజనాల గురించి మరింత తెలుసుకోండి... మీరు చాలా ఆరోగ్యకరమైన, ఆర్థికమైన మరియు మీ ఆరోగ్యానికి తక్కువ ప్రమాదాలను కలిగి ఉన్న సూపర్ అల్పాహారం కోసం చూస్తున్నట్లయితే, ఒక గిన్నె ఫాక్స్ గింజలను తినండి.

## జూలై నెలలో తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో విశేష ఉత్సవాలు

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త జూలై 04, 11, 18, 25 తేదీలలో శుక్రవారం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవం సందర్భంగా మాడ వీధులలో భక్తులను ఆశీర్వదించనున్న శ్రీ పద్మావతీ అమ్మవారు. జూలై 12న ఉత్తరాషాడ నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6.45 గంటలకు మాడ వీధులలో గజ వాహనంపై విహరించనున్న అమ్మవారు.

**శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో...** జూలై 03, జూలై 30 తేదీలలో హస్త నక్షత్రం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారు సాయంత్రం 5 గంటలకు తిరుచ్చిపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. జూలై 16న దక్షిణాయన పుణ్యకాలం సందర్భంగా సా. 5 గం.లకు తిరుచ్చిపై మాడ వీధులలో విహరించనున్న శ్రీ సూర్యనారాయణ స్వామి వారు

**శ్రీ సుందరరాజ స్వామి ఆలయంలో...** జూలై 16న ఉత్తరభద్ర నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గం.లకు తిరుచ్చిపై మాడ వీధులలో విహరించనున్న శ్రీ సుందరరాజ స్వామి వారు

**శ్రీ బాలకృష్ణ స్వామి ఆలయంలో..** జూలై 21న రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గం.లకు తిరుచ్చిపై విహరించనున్న శ్రీ కృష్ణ స్వామివారు.

**అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో...** జూలై 01న ఉదయం 8 గంటలకు అష్టదళ పాదపద్మారాధన సేవ., జూలై 09న ఉదయం 8 గంటలకు అష్టోత్తరశత కలశాభిషేకం., జూలై 04, 11, 18, 25 తేదీలలో శుక్రవారం సందర్భంగా ఉదయం 7 గంటలకు వస్త్రాలంకారణ సేవ, అభిషేకం.

## భారత సాహిత్య రాయబారి ఆచార్య యార్లగడ్డకు మిచిగాన్ గవర్నర్ ప్రశంస



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రముఖ హిందీ, తెలుగు సాహితీవేత్త, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కు మిచిగాన్ గవర్నర్ గౌరవ గ్రెట్చెన్ విట్మర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. యార్లగడ్డ అమెరికా పర్యటన సందర్భంగా గవర్నర్ ప్రత్యేకంగా లేఖ రాసి, భారతీయ భాషల అభివృద్ధికి, సాంస్కృతిక బంధాల బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. "మీరు భారతదేశం, అమెరికా మధ్య సాంస్కృతిక వారసత్వానికి మార్గం వేశారన్నారు. సాహిత్య, విద్యా సేవలు అమెరికాలో నివసిస్తున్న భారతీయులకు ప్రేరణగా నిలుస్తున్నాయి," అని గవర్నర్ లేఖలో పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో హిందీ ఆచార్యులుగా, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ ఛైర్మన్ గా, విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడిగా, భారత ప్రభుత్వ హిందీ సలహా మండలిలో సభ్యుడిగా యార్లగడ్డ నిర్వహించిన కీలక పాత్రలను గవర్నర్ గుర్తుచేశారు. "మీ సాహిత్య సేవలు, ముఖ్యంగా హిందీ, తెలుగు భాషా సౌందర్యాన్ని భావితరాలకు అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి," అని గవర్నర్ యార్లగడ్డ ను అభినందించారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సుదీర్ఘ కాలంగా భాష, సాహిత్యం, సాంస్కృతిక పరస్పర సంబంధాల కోసం కృషి చేస్తూ భారతీయ మేధస్సును ప్రపంచానికి పరిచయం చేస్తూ వస్తున్నారు. ఆయన విశ్వవ్యాప్త సాహిత్య చర్చలకు వేదిక కల్పిస్తూ, భాషల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించడంలో ప్రముఖ పాత్ర వహించారు. అంతర్జాతీయ స్థాయిలో తెలుగువారి గౌరవాన్ని పెంపొందించిన యార్లగడ్డకు వచ్చిన ఈ గౌరవం తెలుగువారందరికీ గర్వకారణమని పలువురు సాహితీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు.


## "వృత్తి విద్య శిక్షణ సర్టిఫికెట్స్ పంపిణీ"



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : HCL ఫౌండేషన్ మరియు వాసవ్య మహిళా మండలి సంయుక్తా ఆధిరాం అమ్మ ప్రొజెక్ట్ కార్యక్రమం లో భాగంగా, వాసవ్య మహిళా మండలి సిల్వర్ జూబ్లీ హాల్ నందు ఫ్యాషన్ డిసైనింగ్, బ్యూటీషన్, tally కోర్స్ లకు సంభందించి, వృత్తి విద్య శిక్షణ సర్టిఫికెట్స్ పంపిణీ లో భాగముగా, Dr. B. కీర్తి మాట్లాడుతూ, మన వాసవ్య మహిళా మండలిలో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు మీ తోటి వారికి మీరు నేర్చుకొన్నవి నేర్పి, ప్రతి మహిళను ఆర్థికముగా అభివృద్ధి పథంలో నడిపించాలి అని చెప్పటం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ గారైన Dr. G. లక్ష్మీషా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమము నందు Dr. B. కీర్తి ప్రెసిడెంట్ వాసవ్య మహిళా మండలి, Smt. G. రశ్మీ సెక్రటరీ VMM మరియు Dr. పి. దీక్షా, మెడికల్ ఇంచార్జి పాల్గొన్నారు. వాసవ్య మహిళా మండలి నందు ట్రైనింగ్ పొందిన వివిధ విభాగాల నుండి లబ్ధి పొందిన కొంతమంది, వారి జీవితంలో వచ్చిన మంచి మార్పులను గురించి కలెక్టర్ కి చెప్పటం జరిగింది. కలెక్టర్ మాటలాడుతూ, నేను వాసవ్య మహిళా మండలి కు రావటం నాకు చాలా సంతోషముగా ఉంది. వాసవ్య మహిళా మండలి కార్యక్రమాలు ఆదర్శనీయం, గోరా ఆశయాలను ముందు తరాలవారికి కూడా అందేలా చేస్తున్న మీకు నా అభినందనలు. వాసవ్య మహిళా మండలి అంటే game changer అని చెప్పటం జరిగింది. గవర్నమెంట్ నుండి చేపడుతలసిన వెల్ఫేర్ స్కీమ్ లకు, నేను చేయవలసినవి తప్పకుండా చేస్తాను అని చెప్పారు. P-4 అనే కాన్సెప్ట్ ను వాసవ్య మహిళా మండలి చేయటం ఆనందముగా వుంది అని అన్నారు. వృత్తి విద్య కోర్స్ లు పూర్తి చేసిన వారికి కలెక్టర్ చేతులమీదుగా సర్టిఫికెట్ లు అందజేయడం జరిగింది. చివరగా Smt. G. రష్మీ వందన సమర్పణ చేయటము జరిగింది.

## వైయస్ జగన్ హయాంలోనే పారిశ్రామిక ప్రగతి..

**: పోతిన వెంకట మహేష్**




తాడేపల్లి, నేటి పత్రిక ప్రజావార్త : ఏడాది కాలంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో పారిశ్రామికరంగం తిరోగమనంలో ఉందని వైయస్ఆర్సీపీ నాయకుడు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పోతిన వెంకట మహేష్ మండిపడ్డారు. తాడేపల్లి వైయస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకురాలేక, గతంలో వైయస్ జగన్ హయాంలో సాధించిన ప్రగతిని నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడుపుల కోసం పరిశ్రమలపై కూటమి నేతల రౌడీయిజం కారణంగా కొత్త పరిశ్రమలు రాకపోవడంతో పాటు, ఇప్పటికే ఉన్న పరిశ్రమలు కూడా రాష్ట్రం నుంచి పారిపోతున్నాయని ధ్వజమెత్తారు. 1999 ఎన్నికల ప్రచారంలో ఇదే చంద్రబాబు కోటి ఉద్యోగాలు కల్పిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వాటిల్లో కనీసం లక్ష ఉద్యోగాలు అయినా కల్పించారా? ఆయనకు దమ్ముంటే వెల్లడించాలి. జగన్ హయాంలోనే 2023లో ఎన్టీపీసీ తొలిసారిగా 1.10 లక్షల కోట్ల రూపాయలతో గ్రీన్ ఎనర్జీ యూనిట్‌ను ఏపీలో ఏర్పాటు చేసుకునేందుకు విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఒప్పందం చేసుకుంది. దానికి అన్ని అనుమతులు, భూబదలాయింపులు కూడా వైయస్ జగన్ ప్రభుత్వంలోనే జరిగాయి. ఉద్యోగాల కల్పన చేస్తామని చంద్రబాబు విలువైన భూములను తమ బినామీ కంపెనీలకు దారాదత్తం చేస్తున్నారు. చంద్రబాబు రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించాలి, పెట్టుబడులను ఆకర్షించాలనే ముసుగులో తన బినామీలకు వేల కోట్ల విలువైన భూములను దారాదత్తం చేసి, దాని ద్వారా తాను లబ్ధి పొందాలన్నదే లక్ష్యంగా కనిపిస్తోందన్నారు.




# తెలంగాణ వార్తలు



## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ సర్కార్ తీపికబురు




తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఓ శుభవార్త అందించింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులకు సంబంధించిన నిధులను విడుదల చేసింది. మొత్తం రూ. 180.30 కోట్ల విలువైన వైద్య బిల్లుల బకాయిలకు సంబంధించి నిధులు విడుదల చేసినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 26,519 మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపశమనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నిధులను విడుదల చేసినట్లు భట్టి విక్రమార్క వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేరుకుపోయిన బకాయిలతో పాటు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న వైద్య బిల్లులను కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయడం గమనార్హం. ఈ పెండింగ్ బకాయిలను విడుదల చేయడం పట్ల ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారు స్వాగతించారు. ఈ చర్య ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందని వారు అభిప్రాయపడ్డారు.

## హైదరాబాద్ చెరువుల పరిరక్షణ: ప్రజలకు హైడ్రా విజ్ఞప్తి

హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : హైదరాబాద్ నగరంలో వరద ముప్పును తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా హైడ్రా కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలోని చారిత్రక గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు నడుం బిగించింది. వర్షాకాలంలో నీరు రోడ్లు, నివాస ప్రాంతాలను ముంచెత్తకుండా నేరుగా చెరువుల్లోకి చేరేలా చూడటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. తొలి విడతగా ఆరు చెరువులను పునరుద్ధరించే పనులను హైడ్రా ప్రారంభించింది. చెరువులు, నాలాల పరిరక్షణ అత్యంత ఆవశ్యకమని, వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని హైడ్రా స్పష్టం చేసింది. దురదృష్టవశాత్తూ అనేక చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, దీనివల్ల నగరంలో వరద సమస్య తీవ్రమవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆక్రమణలను అరికట్టేందుకు నగర పౌరుల సహకారం కూడా ఎంతో కీలకమని హైడ్రా అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో, ప్రజలు తమ పరిసరాల్లో చెరువులు, నాలాలు కబ్జాకు గురవుతున్నట్లు గమనిస్తే వెంటనే సమాచారం అందించాలని హైడ్రా విజ్ఞప్తి చేసింది. ఇందుకుగాను ప్రత్యేక వాట్సాప్ నెంబర్ 8712406899 ను కేటాయించింది. కబ్జాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో పాటు, ఆ ప్రాంతాన్ని స్పష్టంగా తెలియజేసే లొకేషన్‌ను కూడా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపించాలని సూచించింది. ఇవే కాకుండా 'కమిషనర్ హైడ్రా' పేరిట ఉన్న అధికారిక ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల ద్వారా కూడా ప్రజలు సమాచారాన్ని చేరవేయవచ్చని హైడ్రా తెలిపింది. అత్యవసరమైతే, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కు నేరుగా 7207923085 నంబర్ ద్వారా కూడా సమాచారం అందించవచ్చని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రజల భాగస్వామ్యంతోనే చెరువుల పరిరక్షణ సాధ్యమవుతుందని, నగరాన్ని వరదల నుంచి కాపాడుకోవచ్చని హైడ్రా ఆశాభావం వ్యక్తం చేసింది.

## రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను, ముఖ్యంగా గురుకులాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఆదర్శంగా నిలిచిన గురుకులాల పరిస్థితి నేడు దయనీయంగా మారిందని, ప్రభుత్వ ఉదాసీనత వల్ల లక్షలాది మంది బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తోందని ఆయన ట్విట్టర్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలకు ఆహార పదార్థాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఈ ఏడాది జనవరి నుంచి బిల్లులు చెల్లించడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. దీనివల్ల ఇప్పటికే కోడిగుడ్లు, మాంసం, అరటిపండ్ల సరఫరా నిలిచిపోయిందని గుర్తుచేశారు. జులై 1 నుంచి అన్ని రకాల సరఫరాలను నిలిపివేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరిస్తున్నారని, ఇది విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, గత 13 నెలలుగా గురుకుల భవనాలకు సంబంధించిన అద్దె బకాయిలు పేరుకుపోయాయని హరీశ్ రావు తెలిపారు. సుమారు రూ. 450 కోట్లకు పైగా అద్దె చెల్లించకపోవడంతో, పలు ప్రాంతాల్లో భవన యజమానులు పాఠశాలలకు తాళాలు వేయడం మొదలుపెట్టారని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యార్థులు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై చాలా రోజులు గడుస్తున్నా, విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్స్, స్కూల్ బ్యాగులు, బూట్లు వంటి కనీస సౌకర్యాలను కూడా ప్రభుత్వం ఇప్పటివరకు అందించలేదని ఆయన మండిపడ్డారు. చిన్నారులు పాత, చిరిగిన దుస్తులతో పాఠశాలలకు వస్తున్న దృశ్యాలు తనను కలిచివేశాయని చెప్పారు. కేసీఆర్ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన గురుకులాల వ్యవస్థ, రేవంత్ రెడ్డి పాలనలో ఇలా నిర్వీర్యం కావడం అత్యంత బాధాకరమని హరీష్ రావు వ్యాఖ్యానించారు.


## మీకు కళ్లు కనిపించడం లేదా?: రేవంత్ ప్రభుత్వంపై ఈటల ఫైర్



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో 'హైడ్రా' పేరుతో ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ల కూల్చివేతలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఈ కూల్చివేతలపై మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఈరోజు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జవహర్‌నగర్‌లో పర్యటించిన ఆయన, పేద ప్రజల ఇళ్లను కూల్చివేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. జవహర్‌నగర్‌లో బాధితులతో మాట్లాడిన అనంతరం ఈటల మీడియాతో మాట్లాడుతూ.. 30, 60 గజాల స్థలంలో ఇల్లు కట్టుకునేవాడు ధనవంతుడా లేక నిరుపేదో ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. "చిన్న స్థలాల్లో గూడు కట్టుకుంటున్న వారిపై మీ ప్రతాపం చూపించడం సిగ్గుచేటు. మూర్ఖుల్లారా.. మీకు కళ్లు కనబడటం లేదా?" అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. పేదల బతుకుల్లో మట్టి కొట్టడం ద్వారా ప్రభుత్వానికి ఏం లభిస్తుందని ఆయన నిలదీశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలపై ఈటల సంచలన ఆరోపణలు చేశారు. బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో ఎకరాకు రూ. 50 కోట్ల నుంచి రూ. 100 కోట్లు విలువ చేసే భూములను కాంగ్రెస్ నాయకులు కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. ఆ అక్రమ కట్టడాలను, కబ్జాలను క్రమబద్ధీకరించేందుకే జీవో నెం. 58, 59 తీసుకొచ్చారని ఆయన ధ్వజమెత్తారు. ఒకవైపు బడా నేతల కబ్జాలను కాపాడుతూ, మరోవైపు పూరి గుడిసెలను కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లంచాలు ఇవ్వని కారణంగానే అధికారులు గద్దల్లా వాలిపోయి పేదల ఇళ్లను నేలమట్టం చేస్తున్నారని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటమాడుతోందని, వారి ఉసురు కచ్చితంగా తగులుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి పిచ్చి వేషాలు మానుకోవాలని, నిరుపేదల విషయంలో తన వైఖరిని మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందని ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఆప్కో ఉద్యోగులకు సైతం 2022 పిఆర్సి అమలు

**సంస్థ ఉన్నతికి విస్తృత కార్యాచరణ : ఆర్ పి సిసోడియా**



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగంగా ఆప్కో ఉద్యోగులకు సైతం 2022 పిఆర్సిని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ లూమ్స్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం నిర్ణయించింది. బుధవారం విజయవాడ ఆప్కో కేంద్ర కార్యాలయంలో సంస్థ ఛైర్మన్, చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా అధ్యక్షతన పాలక మండలి సమావేశం జరిగింది. చేనేత కార్మికుల అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలపై లోతుగా చర్చించిన పాలకమండలి కీలక అంశాలను అమోదించింది. ప్రధానంగా గత ప్రభుత్వ హాయాంలో ఆప్కో ఉద్యోగులకు పిఆర్ సి అమలు చేయకుండా కాలయాపన చేయగా, ప్రస్తుత బోర్డు ఉద్యోగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, ఇప్పటి నుండి పెరిగిన జీతాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఆప్కో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కుంటున్నప్పటికీ, సంస్థ ఉన్నతికి ఒక పక్క ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తూ, మరోవైపు ఉద్యోగుల అంకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించామన్నారు. ఈ నిర్ణయం వల్ల ఆప్కో శాశ్వత ఉద్యోగులు లబ్ది పొందుతారన్నారు. మరోవైపు ఉద్యోగుల సంపాదిత సెలవులో ప్రతి సంవత్సరం 15 రోజులు సెలవును నగదుగా మార్చుకునేందుకు సైతం పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. ఆప్కో ఉన్నతికి సంబంధించి పలు నిర్ణయాలను సైతం పాలకమండలి ఆమోదించిందని సంస్థ నిర్వహణా సంచాలకులు విశ్వ మనోహరన్ తెలిపారు. ఆప్కో పై ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ నిర్వహించిన అధ్యయనం నివేదికను పరిగణనలోకి తీసుకుని తదనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామన్నారు. సొసైటీలకు పెండింగ్ లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. విశ్వవ్యాప్త విక్రయాలను ప్రోత్సహించేలా ఆప్కో వెబ్ సైట్ ను ఆధునీకరించనున్నామని విశ్వ మనోహరన్ తెలిపారు. అప్కో , లేపాక్షి సంస్థల ఉత్పత్తులు రెండు సంస్థల షోరూమ్ లలో ఉండేలా తీసుకున్న నిర్ణయాన్ని పాలకమండలి స్వాగతించిందన్నారు. చేనేత, జౌళి శాఖ కమీషనర్ జి.రేఖారాణి మాట్లాడుతూ చేనేత కార్మికులకు మెరుగైన వేతనాలు లభించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సమావేశంలో పాలకమండలి డైరెక్టర్లుగా ఉన్న నాబార్డు ఎజిఎం మిలింద్ చౌసల్కర్, ఆప్కాబ్ సిజిఎం నర్రా వెంకటరత్నం, ఎన్ సిడిసి ప్రాంతీయ సంచాలకులు స్నేహాన్షు గోస్వామి, ఆన్ లైన్ విధానంలో పరిశ్రమల శాఖ ఉప కార్యదర్శి నేతల వీర విజయ కుమారి పాల్గొన్నారు. ఆప్కో జిఎం నాగేశ్వరరావు, ఎజిఎంలు హరికృష్ణ, బేనహర్, సాయిబాబు, ఎఓ శ్రీనివాసరావు తదితరులు సమావేశంలో ఉన్నారు.

## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎంపికపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి నియామకం వ్యవహారంపై ఆ పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ రాష్ట్ర సారథిని అధిష్టానం అంతర్గత ఎన్నికలు నిర్వహించి ఎన్నుకో[illegible] ఇలా నావాళ్లు, నీవాళ్లు అంటూ నియామకాలు చేపడితే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా అధిష్టానం ఇప్పటికే ఒక వ్యక్తి పేరును ఖరారు చేసినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోందని రాజాసింగ్ తెలిపారు. ఈ పద్ధతిని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. "పార్టీ అధ్యక్షుడిని బూత్ స్థాయి కార్యకర్త నుంచి మొదలుకొని ముఖ్య నేతల వరకు అందరూ ఓటు వేసి ఎన్నుకోవాలి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలన్న లక్ష్యం నెరవేరాలంటే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం చాలా అవసరమని ఆయన స్పష్టం చేశారు. "నావాడు, నీవాడు అనే ధోరణితో పదవులు ఇచ్చుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం తప్పదు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే అధ్యక్ష పదవికి కచ్చితంగా ఎన్నిక నిర్వహించాలి" అని తేల్చిచెప్పారు. అధ్యక్షుడి నియామకంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ బీజేపీలో కొత్త చర్చకు దారితీశాయి.

## ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలను టార్గెట్ చేస్తున్నారు..



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా పాలన సాగిస్తోందని, పార్టీ కండువా ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తూ పక్షపాతం చూపుతోందని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో తలాతోక లేని పాలన కొనసాగుతోందని ఆమె ఎద్దేవా చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని గ్రీన్‌రిచ్ కాలనీలో సబితా ఇంద్రారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజా సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమయ్యాయని సబితా రెడ్డి ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుంటోందని అన్నారు. అక్కడి అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అనవసర విషయాలపై కాకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలని, అధికారులను వేధించడం సరైన పద్ధతి కాదని ఆమె హితవు పలికారు. ప్రజలకు ఏ సమస్య ఎదురైనా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వంతో పోరాటం చేసైనా సరే నియోజకవర్గానికి అవసరమైన నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తానని ఆమె స్థానికులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శోభా ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి మమతా కృష్ణారెడ్డి, బోయపల్లి దీపికా శేఖర్‌రెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ ఉండాలి





విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :స్విమ్మింగ్ పూల్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా గాంధీనగర్ స్విమ్మింగ్ పూల్, ధర్నాచౌక్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ శ్రేయస్థాయి స్విమ్మింగ్ పోటీలు జరుగుతున్నప్పటికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ నిర్వహించాలని, స్విమ్మింగ్ పూల్ లో వచ్చే ప్రతి ఒక్కరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, షవర్, జిమ్, మరుగుదొడ్ల నిర్వహణ ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని, ఏమైనా మరమ్మతులు ఉన్న చో వెంటనే స్పందించి సత్వరముగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్ ఆవరణ పరిశుభ్రం గా ఉంచాలని, పూల్ ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించెందుకు మొక్కలను పెంచాలని అన్నారు. పోటీలు జరుగుతున్న సమయంలో ప్రేక్షకులు వీక్షించేందుకు గ్యాలరీలు అభివృద్ధి చేయాలని అన్నారు. ధర్నా చౌక్ లో ఉన్న అన్న క్యాంటీన్ లో పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తూ ఎటువంటి మరమ్మత్తులో ఉన్న వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ ద్వారా జరుగుతున్న పారిశుధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాన రహదారులలో మెషిన్ల తరచుగా పారిశుధ్య నిర్వహణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజనీర్లు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడి) పి. వెంకట నారాయణ, డి. యఫ్. ఒ మాల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, తదితర్లు పాల్గొన్నారు.

## అమ్మవారికి ఆషాడమాసం సారే సమర్పించిన దశావతార అమ్మవారి భక్త బృందం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆషాడమాసం సారెను చిట్టినగర్ శ్రీ నగరాల కొత్త అమ్మవారి దేవస్థానం నుండి వందమంది దశావతార అమ్మవారి భక్త బృందం ఊరేగింపుగా మేళతాళాలతో డప్పులతో భక్తి శ్రద్ధలతో బయలుదేరి ఆంజనేయ వాగు నేరుబొమ్మ సెంటర్ బ్రాహ్మణ వీధి కనకదుర్గ నగర్ మీదుగా వెళ్లి అమ్మవారికి సారే సమర్పించారు. అమ్మవారికి పట్టు చీర పసుపు కుంకం 21 రకాల సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోతిన విజయలక్ష్మి, పిళ్ళా మాధవి, పోతిన పుష్పలత, పోతిన భవాని, అడ్వకేట్ పోతిన పుష్పలత, తాత్రాజుల ఉమాదేవి, గుజ్జారి భవాని,పోతిన దుర్గ భవాని, పిల్ల రాణి, పిల్ల హారతి తదితరులు పాల్గొన్నారు.

# మెప్మాలో పనిచేసే రిసోర్స్ పర్సన్స్ కు ట్యాబ్ లు అందించిన రాష్ట్ర ప్రభుత్వం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : మెప్మా, డ్వాక్రా సంఘాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికలు. డ్వాక్రా మహిళలను అభివృద్ధి పరిస్తే ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం త్వరగా సాధ్యమవుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ స్లం సమాఖ్య రిసోర్స్ పర్సన్స్‌కు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం నగరంలోని ఐ.వి ప్యాలెస్ లో జరిగింది. మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ట్యాబ్ ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 500 మంది ఆర్.పిలకు 35 వేల రూపాయలు విలువ చేసే ట్యాబ్ లు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి డ్వాక్రా సంఘాలకు ఆర్.పిలు వారధిగా వున్నారంటూ వారి సేవలను కొనియాడారు. సీఎం చంద్రబాబు పనులు వేగవంతంగా



అయ్యేందుకు సమూలంగా డిజిటిలైజేషన్ కోసం మార్పులు చేస్తున్నారని, అందులో భాగంగానే ఆర్.పి లకు ట్యాబ్ లు అందించటం జరుగుతుం దన్నారు. పట్టణ పేదరిక నిర్మూలిన సంస్థ మెప్మా విభాగం ద్వారా డ్వాక్రా సంఘాల అభివృద్ధి కార్యక్రమ నిర్వహణ కోసం పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ లకు దిశా నిర్ధేశం చేశారు. ప్రజల దైనందిన జీవితంలో ప్రజలకు అవసరమైన విషయాలు ఆలస్యంగా కాకుండా త్వరితగతిన ప్రభుత్వానికి తెలియజేయటం కోసం, ఆ విషయాలను తక్షణం అమలు చేయటం కోసం ఈ డిజిటలైజేషన్ ప్రక్రియ సీఎం చంద్ర బాబు ప్రారంభించారని తెలిపారు. డ్వాక్రా మహిళలు సిల్క్ డెవలప్మెంట్ సెంటర్స్, కామన్ పెసిలిటీ సెంటర్స్ తమ సొంత నిధులతో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. చాలా మంది రుచిగా, శుచిగా పచ్చళ్లు తయారు చేస్తారు కానీ ప్యాకింగ్ బాగోదు..కామన్ పెసిలిటీ సెంటర్ లో ప్యాకింగ్ ఏర్పాటు చేయటంతో పాటు ఉచితంగా మార్కెటింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తామన్నారు. స్కిల్ డెవలప్ సెంటర్, కామన్ ఫెసిలిటీ, మార్కెటింగ్ ఈ మూడు కూడా డ్వాక్రా మహిళలకు అందించగలిగితే అభివృద్ధి సాధించటమే కాదు.. మహిళ సాధికారత సాధిస్తారన్నారు. ఆ తర్వాత కుటుంబానికో వ్యాపారవేత్త తయారు చేయటం సులువుగా మారుతుందన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఉచితంగా మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ప్రణాళిక సిద్దం చేశారని, సింగ్‌నగర్‌లో డ్వాక్రాబజార్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన జరుగుతుం దన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పశ్చిమ నియోజకవర్గం, తూర్పు నియోజకవర్గాలతోపాటు, ఇబ్రహీంపట్నం నందిగామ, జగ్గయ్యపేట జాతీయ రహదారులపై డ్వాక్రా బజార్లు ఏర్పాటు చేసే విషయం కలెక్టర్ తో చర్చించటం జరిగిందన్నారు. డ్వాక్రా బజార్లు లో రోటేషన్ పద్ధతిలో నాలుగైదు రోజుల పాటు ఉచితంగా ప్రొడక్ట్స్ అమ్ముకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ బజార్లో అరకు కాఫీ తోపాటు, కొండపల్లి బొమ్మలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జనాభాలో సగం పైన వున్న మహిళలకు అండగా వుండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలో వున్నా మహిళలకు ఆర్థిక, విద్య, సామాజిక పరంగా అన్ని విధాలుగా అండగా వుంటున్నారని తెలిపారు. త్వరలోనే ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో డ్వాక్రా బజార్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పి.వో వెంకట నారాయణ, జిల్లా అర్బన్ మహిళ సమాఖ్య ప్రెసిడెంట్ కె.మీనాక్షి, కోశాధికారి కె.త్రివేణి, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టిడిపి ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్, టిడిపి నాయకులు వి.నరసింహా చౌదరి, మాదిగాని గురునాథం లతో పాటు మెప్మా టి.ఈలు, సి.డి.వోలు, ఎస్.డబ్ల్యూ, సి.వోలు , సి.ఎల్.ఆర్.ఎపిలు, ఆర్.పి లు, టి.ఎల్.ఎఫ్.ఓ.బి లు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయి పురస్కారాలు

*- మూడు విభాగాల్లో ప్రపంచ ఫొటోగ్రఫీ డే పోటీలు*

*- ఎంట్రీలు పంపేందుకు చివరితేదీ జులై 31*

*- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు 19) సందర్భంగా విశేష ప్రతిభకనబరిచిన ఫొటో గ్రాఫర్లకు జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేయడం జరుగుతుందని ఎన్ టి ఆర్ జిల్లా పరిధిలోని ఫొటో జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు పోటీలలో పాల్గొనవచ్చునన్నారు. ఫొటోగ్రాఫర్లు జులై 31వ తేదీలోగా తమ ఎంట్రీలు పంపాల్సి ఉంటుందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని.. మొదటి విభాగంలో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్‌టీఆర్, యోగాంధ్ర అంశాలకు సంబంధించి ఫొటో ఎంట్రీలు పంపొచ్చన్నారు. రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం - 2 ఉన్నాయని, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ (రూ. 10 వేలు), ద్వితీయ (రూ. 7,000), తృతీయ (రూ. 4 వేలు) బహుమతులతో పాటు రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక సెక్షన్ నుంచి మూడు ఫొటోలు, అదేవిధంగా మొత్తం మూడు సెక్షన్ల నుంచి తొమ్మిది ఫొటోలు పంపవచ్చు. 2024, జూన్ 12 నుంచి 2025, జులై 31 మధ్య తీసిన ఫొటోలై ఉండాలి. ఫొటో సైజు 12X10 ఉండాలని, ఫొటోలు ఎన్‌టీఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలి. వాటర్ మార్క్, మార్ఫింగ్ వంటి వాటిని అనుమతించడం జరగదు. ఉత్తమ ఫొటోల ఎంపిక విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని, ఒరిజినల్ ఫొటో ఎంట్రీలను డీపీఆర్‌వో కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్, విజయవాడ-520002 చిరునామాకు నేరుగా లేదా పోస్టల్ ద్వారా సమర్పించవచ్చునని ఇతర వివరాలకు 9121215373 నందు సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

**మనసు బాధపడేలా ఎవరైనా మాట్లాడితే వారికి మౌనమే మంచి సమాధానం ఎందుకంటే మనకంటే మంచి సమాధానం కాలమే చెప్తుంది**

# 1యం1బి జాబ్ మేళాలో 400 మందికి పైగా యువ ఉద్యోగార్థులు



పశ్చిమ గోదావరి, నేటి పత్రిక ప్రజావార్త : నైపుణ్య లోటును తీర్చడం మరియు యువతకు ఉద్యోగయోగ్యతను పెంపొందించడంలో మైలురాయిగా నిలిచిన ఈ కార్యక్రమంలో, ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 1యం1బి (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) సంస్థ, విశ్వ తేజ డిగ్రీ కాలేజీ, పెనుగొండ, నరసాపురం తో కలిసి, పశ్చిమ గోదావరి జిల్లాలో తొలి 1యం1బి జాబ్ మేళాను గురువారం, జూన్ 26న నిర్వహించింది. ఈ జాబ్ మేళా యువ ఉద్యోగార్థులకు అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలను కల్పించి, వారి జీవితాలను మార్చే దిశగా ముందడుగు వేసింది. ఒక రోజు పాటు కొనసాగిన ఈ జాబ్ మేళాలో కాలేజీ ప్రముఖులు మరియు 1యం1బి బృంద సభ్యులు పాల్గొన్నారు. పెనుగొండ, ఉండి, నరసాపురం, భీమవరం వంటి ప్రాంతాల నుండి వచ్చిన యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ జాబ్ మేళా యొక్క ముఖ్య ఉద్దేశ్యం, ముఖ్యంగా తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల యువతకు ఉద్యోగ అవకాశాలను అందించడమే. తయారీ, రిటైల్, ఎలక్ట్రానిక్స్, టెలికాం, BFSI, సేల్స్ వంటి అనేక రంగాలలో 300 కి పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. అదనంగా, హాజరైన అభ్యర్థులు కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి వంటి ఇంటరాక్టివ్ సెషన్లలో పాల్గొని, కార్పొరేట్ సంస్కృతి, ఇంటర్వ్యూ సిద్ధతపై విలువైన సమాచారాన్ని పొందారు. ఈ కార్యక్రమం సందర్భంగా అనేక అభ్యర్థులు ఎంపికయ్యారు మరియు తదుపరి నియామక దశలకు పంపించబడతారు.

**ఎంపికైన అభ్యర్థులను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ మరియు తమిళనాడు రాష్ట్రాలలో నియమించనున్నారు....** 1యం1బి వ్యవస్థాపకుడు మనవ్ సుబోధ్, ఈ కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ..1యం1బి జాబ్ మేళా అనేది యువ ఉద్యోగార్థులకు మరియు ప్రముఖ నియామక సంస్థలకు మధ్య ఒక ముఖ్యమైన వేదికగా మారింది. అంతేకాకుండా, మేము వారిని అవసరమైన సాఫ్ట్ స్కిల్స్ మరియు ప్రొఫెషనల్ శిక్షణతో సమృద్ధిగా తయారు చేస్తున్నాం. యువత మరియు కంపెనీల అద్భుతమైన పాల్గొనడం చాలా ప్రేరణ కలిగించే విషయం. జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ మద్దతుతో ఇది ఒక ప్రారంభం మాత్రమే –పశ్చిమ గోదావరి యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం. అని అన్నారు." ఇలాంటి మరిన్ని జాబ్ మేళాలను నిర్వహించడమే కాకుండా, 1యం1బి త్వరలో పశ్చిమ గోదావరిలో ఒక "జాబ్ రెడినెస్ సెంటర్"ను కూడా ఏర్పాటు చేయనుంది. గత నెల తూర్పు గోదావరి జిల్లా మల్కిపురంలో నిర్వహించిన 1యం1బి జాబ్ మేళాలో 350 మంది యువ ఉద్యోగార్థులు పాల్గొని, 200 ఉద్యోగ అవకాశాలు అందించబడ్డాయి. ఈ జాబ్ మేళాల కార్యక్రమం, యువతకు స్థిరమైన, మంచి పారితోషికం కలిగిన ఉద్యోగాలు కల్పించి, ఆర్థిక అభివృద్ధి, దీర్ఘకాలిక కెరీర్ అభివృద్ధి లక్ష్యంగా నడుస్తోంది.

# హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్‌లో సీమెన్స్ బయోగ్రాఫ్ పెట్- సిటీ స్కాన్

*-హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్‌లో క్యాన్సర్ నిర్ధారణ, నివారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం - బొండా ఉమ*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : గుణదలలోని హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్‌లో శనివారం అధునాతన "పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ మరియు కంప్యూటెడ్ టోమోగ్రఫీ స్కానింగ్ మెషిన్" (సీమెన్స్ బయోగ్రాఫ్ పెట్– సిటీ స్కాన్) యంత్రాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం కల్పించి రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందన్నారు. హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని అందిపుచ్చుకొని క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించే అత్యాధునిక సీమెన్స్ బయోగ్రాఫ్ పెట్– సిటీ స్కాన్ యంత్రాన్ని హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. పేదలకు సైతం అందుబాటులో ఉండేలా తక్కువ ఖర్చుతోనే గత 15ఏళ్ళుగా హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ సమాజ సేవలో భాగస్వామ్యం అవుతున్నారని, ఆసుపత్రి సేవలను ప్రశంసించారు. సామాజిక బాధ్యతగా సేవాదృక్పదంతో సేవలందించే గోపీచంద్ లాంటి వైద్యులు మరింతమంది ముందుకు రావాలని, క్యాన్సర్ వ్యాధి తొలి దశలోనే వైద్యులను సంప్రదించాలని, గుంటూరు జిల్లా మంగళగిరిలోని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఎయిమ్స్ ఆసుపత్రిలో త్వరలో అన్ని విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పరంగా డాక్టర్ NTR వైద్య సేవ ద్వారా 140 రకాల వ్యాధులకు ఉచితంగా సేవలందిస్తున్నట్లు, హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్ లో ఈ అధునాతనన పెట్ స్కాన్ యంత్రం ద్వారా క్యాన్సర్ కణాలు మరియు కణితులు శరీరంలో ఎక్కడున్నా సులభంగా గుర్తించవచ్చని తద్వారా వ్యాధిని మొదటి దశలోనే పసిగట్టి జబ్బుని అతి సులభంగా నియంత్రించవచ్చని మరియు చికిత్స మధ్యలో జబ్బు తగ్గిందో లేదో తెలుసుకోవచ్చని తెలియజేసారు. ఈ సందర్భంగా హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొంది క్యాన్సర్ మహమ్మారి నుండి బయటపడిన పలువురికి ఆసుపత్రి తరఫున MLA బొండా ఉమ చేతుల మీదుగా సత్కరించారు, హాస్పిటల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి యువకిశోర్ తెర్లి మాట్లాడుతూ, హెచ్.సి.జి. క్యాన్సర్ హాస్పిటల్‌లో క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన అన్ని రకాల చికిత్సలను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల నియామకంపై మోసపూరితమైన వ్యక్తుల మాటలు నమ్మవద్దు..

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఎన్టీఆర్ జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఈనెల 25వ తేదీన ఆశా కార్యకర్తల నియామకంపై వెలువడిన నోటిఫికేషన్ అనుసరించి జిల్లాలో వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా మరియు ఇతర మాధ్యమాల ద్వారా ఆశా కార్యకర్తల పోస్టులు కొందరు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసి మోసపూరితమైన చర్యలకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఇచ్చిన సంయుక్త పత్రిక ప్రకటనలో భాగంగా ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎవరు ఎటువంటి ప్రలోభాలకు లోంగ వద్దని అదేవిధంగా మోసపూరితమైన వ్యక్తుల మాటలు నమ్మవద్దని ఆశా కార్యకర్తల నియామకం కమ్యూనిటీ ప్రాసెస్ మార్గదర్శకాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖలు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే నియామక ప్రక్రియ నడుస్తోంది. జిల్లా హెల్త్ సొసైటీ ద్వారా పూర్తిగా మెరిట్ ఆధారంగా నియామకాలు జరుగుతాయని అర్హతలు అనుసరించి అభ్యర్థులు ఎంపిక జరుగుతుందని తెలియజేస్తూ ఒక ప్రకటనలో తెలియజేయడమైనది.

# నగరంలో అతిపెద్ద రథయాత్ర



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : దేశంలోనే అతిపెద్ద రథ యాత్రగా పేరుగాంచిన ఇస్కాన్ విజయవాడ జగన్నాథ స్వామి రథ యాత్ర మహోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ మందిరాధ్యక్షుడు చక్రధారిదాస్ తెలిపారు. జగన్నాథస్వామి రథయాత్ర పోస్టర్, టీషర్టులను గురువారం ఇస్కాన్ మందిరంలో లైలా గ్రూప్ ఆఫ్ కంపె నీస్ చైర్మన్ గోకరాజు గంగరాజుతో కలిసి ఇస్కాన్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 29 వరకు ఈ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు భవానీపురం సితార గ్రౌండ్స్ నుంచి రథయాత్ర ప్రారంభమై స్వాతి థియేటర్, కనకదుర్గమ్మ గుడి, రథంసెంటర్, సీతమ్మ వారి పాదాల వరకు జరుగుతుందన్నారు. సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న ప్రదేశంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుండిచ మందిరంలో స్వామి ప్రత్యేక దర్శనం ఇస్తారని, ఈ మూడు రోజుల పాటు సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు, స్వామికి పూజలు జరుగుతాయన్నారు. సీఎం చంద్రబాబు, ఇతర ప్రముఖులను ఆహ్వానించామని, అలాగే పలు దేశాల నుంచి వచ్చిన అతిథులు హరినామ సంకీర్తనలు చేస్తారన్నారు. సింటెక్స్ ఇండస్ట్రీస్ అధినేత సుధాకర్ చౌదరి, శ్యామ్ సుందర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి..

*-నేషనల్ ఫోరం ఫర్ దళిత్ క్రిస్టియన్ చైర్మన్ ఐ శామ్యూల్ కుమార్*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని నేషనల్ ఫోరం ఫర్ దళిత్ క్రిస్టియన్ చైర్మన్ ఐ శామ్యూల్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. హిందూ మతం అనుసరించే దళితులకే ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపచేయటం దుర్మార్గమన్నారు. శనివారం గాంధీ నగర్ ప్రెస్ క్లబ్ లో క్రిస్టియన్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సి సి సి), నేషనల్ ఫోరం ఫర్ దళిత్ క్రిస్టియన్(ఎన్ ఎఫ్ డి సి) సంయుక్త ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్ఎఫ్డిసి చైర్మన్ ఐ శామ్యూల్ కుమార్, సిసిసి కోఆర్డినేటర్ డి డానియల్ పాల్గొని మాట్లాడుతూ దళిత క్రైస్తవులు మత ప్రాతిపదికన సంక్షేమ ఫలాలను పొందలేకపోతున్నారన్నారు. దళిత క్రైస్తవులను బీసీ(సి)లుగా పరిగణించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 1950 లోని 3వ పేరాను రద్దుచేసి మత స్వేచ్ఛ హక్కును కాపాడాలన్నారు. హిందూ మతం అనుసరించే దళితులకే ఎస్సీ రిజర్వేషన్లు వర్తిస్తాయనే రాజ్యాంగ విరుద్ధమైన నిబంధనను ఎత్తివేయాలన్నారు. నేటికి కుల వివక్ష, అంటరానితనం అనుభవిస్తున్న దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. సిక్కు, బౌద్ధ మతాల దళితులకు ఎస్సీ రిజర్వేషన్లు ఇచ్చినట్లే దళిత క్రైస్తవులకు కూడా ఇవ్వాలన్నారు. క్రైస్తవ మత ప్రచార హక్కులను హరిస్తున్న మతమార్పిడి చట్టాలను రద్దు చేయాలన్నారు. క్రైస్తవుల పై జరుగుతున్న దాడులను అరికట్టి రక్షణ కల్పించాలన్నారు. ఈ విషయమై ఈనెల 30వ తేదీ జింఖానా గ్రౌండ్లో ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున దళిత క్రైస్తవులు హాజరయి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అవగాహన ఒప్పందం




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో నిర్వహించిన "జీఎఫ్ఎస్‌టీ టూరిజం కాన్క్లేవ్"లో పాల్గొన్నారు. మిషన్ డైరెక్టర్, ఎంఈపీఎంఏ ఎన్. తేజ్ భరత్, ఐ.ఏ.ఎస్ 2025 జూన్ 27న ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మరియు ఏపీ టూరిజం అథారిటీ సీఈఓ సమక్షంలో, MEPMA మరియు ఏపీ టూరిజం అథారిటీ సీఈఓ & ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మధ్య ఒక అవగాహన ఒప్పందం (MoU) కుదిరింది. ఇందులో రెండు సంస్థలు పరస్పర అంగీకారంతో లక్ష్యాలను సాధించడానికి వ్యూహాత్మక భాగస్వాములుగా కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. టూరిజం శాఖతో కలసి వచ్చే నాలుగేళ్లలో సుమారు 5000 స్వయం సహాయ గ్రూప్ (SHG) సభ్యులకు జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు MEPMA లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో హోమ్ స్టేస్, హోటళ్లు, షాపింగ్ అవుట్‌లెట్లు, గైడ్స్, శానిటేషన్ & పార్కింగ్ ఒప్పందాల రూపంలో అవకాశాలు కల్పించనున్నారు.

# మానత్వానికి ప్రతీకగా నిలిచిన మానవత స్వచ్ఛంద సంస్థ



గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గత మూడు సంవత్సరాలుగా గుంటూరులో బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలిచిందని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ పేర్కొన్నారు. గుంటూరులోని బాలాజీ కళ్యాణ మండపంలో జరిగిన మానవత 3వ వార్షికోత్సవ కార్యక్రమానికి పులి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గుంటూరు నగరంలో 5 లక్షల మొక్కలను నాటి హరిత గుంటూరుగా మార్చాలనే సంకల్పంలో మానవత భాగస్వామ్యం కావాలని కోరారు. మానవత లాంటి స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని గుంటూరు నగరాన్ని పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మానవ సంబంధాల విశిష్టతను తెలిపే రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన కవితను చదివి వినిపించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు ప్రసంగిస్తూ 2004లో 108 మంది సభ్యులతో ప్రారంభమైన మానవత నేడు 132 శాఖలకు విస్తరించి, 80 వేల సభ్యులతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం గొప్ప పరిణామమన్నారు. వార్షిక సభ్యత్వం 600 రూపాయలు చెల్లించి మానవతలో సభ్యులుగా చేరి సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటును అందించాలని కోరారు. ఈ సర్వసభ్య సమావేశం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షునిగా డాఎం కోట శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా డాఎం పి. కల్పన, కార్యదర్శిగా కె. సతీష్ బాబు, కోశాధికారిగా టీ. వి. సాయిరాం, సంయుక్త కార్యదర్శిగా కర్నాటి ఆనంద్‌లను ఎన్నుకొని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.

# అంతరిక్షయాత్రకు ఎంపికైన తెలుగు అమ్మాయి



పాలకొల్లు,నేటి పత్రిక ప్రజావార్త : ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన దంగేటి జాహ్నవి అంతరిక్షం లోకి వెళ్లే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. 23 ఏళ్ల జాహ్నవి 2029లో స్పేస్లోకి వెళ్లేందుకు అర్హత సాధించారు. యునైటెడ్ స్టేట్స్ కు చెందిన టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ (TSI) చేపట్టే టైటాన్ స్పేస్ మిషన్ కోసం ఓ వ్యోమగామిగా ఆమె ఎంపికయ్యారు. ఈ యాత్రలో భాగంగా జాహ్నవి అంతరిక్షంలో 5 గంటలపాటు ఉండనున్నారు. ఇందుకోసం ఆమెకు పలు దేశాల్లో ట్రైనింగ్ ఇస్తారు.

# ఆర్చరీ క్రీడాకారులకు శాప్ ఛైర్మన్ అభినందన



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఈనెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ సింగపూర్ లో జరిగిన ఆర్చరీ ఏషియా కప్ లెగ్-2 పోటీల్లో కాంపౌండ్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారుడు టి.గణేష్ మణిరత్నం, అలాగే ఇండివిడ్యువల్, మిక్సిడ్, టీమ్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్స్ సాధించిన క్రీడాకారిణి బి.షణ్ముఖి నాగసాయి విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడుని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్చరీలో వారు సాధించిన పతకాలు, విజయాలు గురించి వివరించారు. సందర్భంగా వారిని శాప్ ఛైర్మన్ అభినందించడంతోపాటు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్ర, దేశ ఖ్యాతిని విస్తృతం చేయాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వోల్గా ఆర్చరీ అకాడమీ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ, ఆర్చరీ కోచ్ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు

# మాదిగ కులస్తుడైన సింగయ్య కుటుంబానికి వైయస్ జగన్ రెండు కోట్లు ఇవ్వాలి

*-ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 18న రెంటపాళ్ళ గ్రామ పర్యటనకు వెళుతుండగా జనం తొక్కిసలాటలో, కారు కింద పడిన సింగయ్య విషయంలో వై ఎస్ జగన్ స్పందించి, ఆసుపత్రికి తీసుకుని వెళితే బ్రతికేవాడని, వైయస్ జగన్ నిర్లక్ష్యమే సింగయ్య మృతికి కారణమని పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విజయవాడ ఏపీ ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరి గిన విలేకరుల సమావేశంలో, పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పాల్గొని మాట్లాడుతూ, ఏపీ పోలీసులు వంద మందితో వెళ్ళమని ముందుగా చెప్పిన వైయస్ జగన్ వినకుండా కనీస జాగ్రత్తలు పాటించకుండా, కారు కింద పడి వ్యక్తి ని ఆసుపత్రిలో చేర్చకుండా రోడ్డు ప్రక్కన వదిలేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఆ ర్యాలీ వల్ల మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఎన్నికల బెట్టింగ్లో ఓడిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డ అగ్రకులానికి చెందిన మీ అభిమాని కుటుంబాన్ని పరామర్శించడానికి ఊరేగింపుగా వెళ్లిన వైఎస్ జగన్, నిన్ను చూడటానికి వచ్చి నీపై పూలు చల్లే క్రమంలో దళితుడైన మీ అభిమాని కారు కింద పడి సింగయ్య చనిపోతే ఆ కుటుంబాన్ని ఇప్పటివరకు ఎందుకు పరామర్శించలేదని పేరుపోగు నిలదీశారు. పుష్ప సినిమా చూడటానికి ర్యాలీగా వెళ్లవద్దని, తెలంగాణ పోలీసులు హెచ్చరించిన, అల్లు అర్జున్ వినకుండా వెళ్ళడం వల్లే ఒక మహిళ, తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిందని, ఆమె కుమారుడు ఇప్పటికీ అపస్మారక స్థితిలో ఉన్నాడని, ఆ కుటుంబానికి అల్లు అర్జున్ రెండు కోట్లు డబ్బులు ఇవ్వటం జరిగిందని, ఏపీలో సింగయ్య ప్రాణం ఖరీదు పదిలక్ష లేనా? అని వై ఎస్ జగన్ ను, పేరుపోగు ప్రశ్నించారు. అల్లు అర్జున్ తరహా లోనే వైయస్ జగన్,సింగయ్య కుటుంబానికి రెండు కోట్లు ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పేరుపోగు డిమాండ్ చేశారు. డా సుధాకర్,సుబ్రహ్మణ్యం, సింగయ్య వంటి దళితుల శవాలతోనే పాలకులు ఎవరైనా రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ ఘటనపై స్పందించి మానవత్వంతో సింగయ్య కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని పేరుపోగు కోరారు. ఈ సమావేశంలో ఎర్రంశెట్టి ప్రసాద్ రెల్లి, బేరి శెట్టి నీలా, సింగంపల్లి హనుమంతరావు, పెద్దాడి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ ల ప్రమాణ స్వీకార మహోత్సవం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతనంగా నియమితులైన డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, "రాష్ట్రంలో క్రీడా అభివృద్ధి, యువత లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడం, శారీరకంగా దృఢమైన సమాజ నిర్మాణం మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌లో భాగంగా 2014-2019 మధ్య ఖరారు చేసిన ప్రణాళికల ద్వారా ఆంధ్రప్రదేశ్ క్రీడారంగానికి పునాదులు పడ్డాయని, అదే మార్గంలో నేటి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రానికి అవసరమైన గేమ్ ప్రాజెక్టులకు కేంద్రాన్ని అభ్యర్థించిన విషయాన్ని గుర్తు చేస్తూ, శాప్ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కలసి గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ప్రతి జిల్లాలో క్రికెట్ స్టేడియంలు నిర్మించేందుకు కృషి జరుగుతోందని, విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే క్రీడా మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యమని మంత్రి రాంప్రసాద్ తెలిపారు. ప్రమాణ స్వీకార చేసిన డైరెక్టర్లు: ఈ. రాజని, ఎ. రమణారావు, ఎం.డి. రమేష్ కుమార్, పేరం రవీంద్రనాథ్, ఎస్. సంతోష్ కుమార్, కె. జగదేశ్వరి, బి. శివ, పి.బి.వి.ఎస్.ఎన్. రాజు (బుచ్చిరాజు).

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ, "క్రీడల్లో రాజకీయాలకు స్థానం లేదు. అభివృద్ధే లక్ష్యం. ప్రతి డైరెక్టర్ సమర్థంగా పనిచేసి యువత భవిష్యత్తు తీర్చిదిద్దే దిశగా కృషి చేయాలి" అని సూచించారు. ఈ కార్యక్రమానికి శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పలు కార్పొరేషన్ చైర్మన్లు హాజరై, నూతన డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.
Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 2021/80559, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.